# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

20.03.2026 శుక్రవారం Friday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 240 | పేజీలు : 10 Pages : 10 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789



## నిఫ్టీ డౌన్.. సెన్సెక్స్ క్రాష్

- మార్కెట్లను కుదిపేసిన 'యుద్ధ' మేఘాలు
- 2496 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- భగ్గుమన్న చమురు ధరలు.. 115 డాలర్లకు బ్రెంట్ క్రూడ్
- అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల యథాతథ నిర్ణయంతో నిరాశ
- ఛైర్మన్ రాజీనామాతో కుప్పకూలిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు
- రూ.13 లక్షల కోట్లు ఆవిరైన మదుపర్ల సంపద

4




పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ వాతావరణం భారతీయ స్టాక్ మార్కెట్లను తీవ్రంగా కుదిపేసింది. వరుసగా 3 రోజుల పాటు లాభాల బాటలో పయనించిన సూచీలు భారీగా పతనమయ్యాయి. బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.13 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.426 లక్షల కోట్లకు పడిపోయింది. నిఫ్టీ కూడా 775.65 పాయింట్లు పడిపోయి 23,002.15 వద్ద స్థిరపడింది.



## ఇంటర్నెట్ వ్యవస్థకు ముప్పు

### ఎర్ర సముద్రంలో డేటా కేబుళ్లపై హౌతీల గురి!

- ఆసియా, యూరప్‌లను కలిపే ప్రధాన కనెక్టివిటీపై డేంజర్ బెల్స్
- అండర్ సీ కేబుళ్లు కట్ అయితే ఆగిపోనున్న అంతర్జాతీయ బ్యాంకింగ్
- కుప్పకూలనున్న స్టాక్ మార్కెట్లు.. నిలిచిపోనున్న డిజిటల్ సేవలు
- మరమ్మతులకు అడ్డంకులు.. పునరుద్ధరణకు నెలల సమయం
- చరిత్రలో తొలిసారి ఇంధన, డిజిటల్ వ్యవస్థలకు ఒకేసారి గండం

4



## డాడీ, మోడీ, చిన్నమోడీపైనే నా పోరు

- రామనవమికి కొత్త పార్టీ 'తెలంగాణ ప్రజా జాగృతి'
- పార్టీ గుర్తుగా 'ధర్మ గంట' దాదాపు ఖరారు
- గాంధీజీ సర్వోదయ సిద్ధాంతంతో ప్రజల ముందుకు..
- జాగృతి అధ్యక్షురాలు కవిత..

3

## కాంగ్రెస్ సీనియర్లకే ఆ 'తొక్కుడు' హెచ్చరిక

- వందేమాతరాన్ని అవమానిస్తే చర్యలేవి?
- ఎంఐఎం మెడలు వంచుతాం
- రేవంత్ భాషపై బండి సంజయ్ నిప్పులు!



3

# రైతే రాజుగా పాలన

### 22న ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు





- తెలంగాణలో 70శాతం వ్యవసాయ ఆధారిత కుటుంబాలే
- పండంటి పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్
- దేశంలోనే రైతులపై అతి తక్కువ రుణభారం మన దగ్గరే
- ఉగాది వేడుకలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 19:** నూతన తెలుగు సంవత్సరం పరాభవ నామ ఉగాదిని రైతు నామ సంవత్సరంగా సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, అన్నదాతను రాజును చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి ఉత్సాహం గా పాల్గొన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ సైతం అందిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. దేశంలోనే రైతులపై అతి తక్కువ రుణభారం ఉన్న రాష్ట్రం తెలంగాణ అని సాక్షాత్తూ కేంద్రం ప్రకటించడం మనందరికీ గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. మిగతా 2 లో

## ప్రభుత్వ విప్‌లుగా ముగ్గురు ఎమ్మెల్యేలు

రేవంత్ సర్కార్ వ్యూహాత్మక నిర్ణయం

విజయరమణారావు, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వేముల వీరేశం నియామకం

2



## ప్రగతికి దిక్సూచిగా రాష్ట్ర బడ్జెట్

2

- అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యం
- గాంధీభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధీమా

## ప్రభుత్వ వైఫల్యాలు ప్రతిపక్షానికి బలం!



- తెలంగాణ భవన్‌లో పంచాంగ శ్రవణం..
- కేటీఆర్ సమక్షంలో పండితుల విశ్లేషణ

3

## నర్మెట్టలో అట్టహాసంగా 'రైతు ఉత్సవాలు' ప్రారంభం



2

- అన్నదాత బాగుంటేనే రాష్ట్రం సుభిక్షం..
- ఆయిల్ పామ్ సాగుపై దృష్టి పెట్టాలి
- మంత్రులు తుమ్మల, పొన్నం, వాకిటి పిలుపు

## అట్టహాసంగా గద్దర్ అవార్డుల వేడుక

- హైటెక్స్ వేదికగా తారల సందడి.. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వ పురస్కారాలు
- ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి.. అవార్డుల ప్రదానం
- ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్న చిరంజీవి
- ఉత్తమ నటుడు నాగ చైతన్య.. ఉత్తమ నటి రష్మిక
- ఏపీ సీఎం చంద్రబాబు స్ఫూర్తి పొందాలన్న చిరంజీవి
- ఇవి గద్దర్ అవార్డులు కావు.. ఖద్దర్ అవార్డులన్న బీఆర్ఎస్

2



నేటి సాక్షి
కరీంనగర్
శుక్రవారం
20 మార్చి 2026



# నర్మెట్టలో అట్టహాసంగా 'రైతు ఉత్సవాలు' ప్రారంభం

## అన్నదాత బాగుంటేనే రాష్ట్రం సుభిక్షం..

## ఆయిల్ పామ్ సాగుపై దృష్టి పెట్టాలి

## మంత్రులు తుమ్మల, పొన్నం, వాకిటి పిలుపు

**నర్మెట్ట, మార్చి 19:** రైతు సంక్షేమమే ధ్యేయంగా, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో 'రైతు ఉత్సవాలు' ఘనంగా ప్రారంభమయ్యాయి. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ ఈ వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 150 స్టాల్స్‌ను వారు సందర్శించి, రైతులకు అందుబాటులో ఉన్న సాంకేతికతను పరిశీలించారు. ఈ ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ వరకు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలకు నూతన వంగడాలను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషిని అభినందించారు. "ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన నేల ఎప్పటికీ సుభిక్షంగా ఉండదు. అందుకే మా ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తోంది. ఇప్పటికే 25 లక్షల మందికి రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేసి అండగా నిలిచాం" అని ఆయన పేర్కొన్నారు. ఆయిల్ పామ్ పంట విస్తీర్ణం పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కృషి చేస్తాయని, ఈ ఉత్సవాల ద్వారా కనీసం 100 మంది రైతులకు ఆయిల్ పామ్ సాగుపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోకుండా ముందస్తు కార్యాచరణ అవసరమని మంత్రి గుర్తుచేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల విషయంలో మాట్లాడటం వారి గొంతు కోయడమేనని హెచ్చరించారు. కృష్ణా, గోదావరి నదుల మధ్య ఉన్న తెలంగాణ అద్భుతంగా నిర్మితం కావాలని, రైతు బాగుపడితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆకాంక్షించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు హరీష్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ హైమావతి, సీపీ రష్మీ పెరుమాళ్‌తో పాటు వేలాది మంది రైతులు ఈ వేడుకలకు హాజరయ్యారు.

# ప్రగతికి దిక్సూచిగా బడ్జెట్

## అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యం

## గాంధీభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధీమా



**హైదరాబాద్, మార్చి 19:** రాబోయే బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా, రాష్ట్ర ప్రగతికి దిక్సూచిగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించిన ఉగాది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణాన్ని వీక్షించి, రాష్ట్ర ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. ఈ 'పరాభవ' నామ సంవత్సరంలో దుష్టశక్తులకు పరాభవం కలగాలని, రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా విలసిల్లాలని కోరుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నెరవేరుస్తుందని డిప్యూటీ సీఎం పునరుద్ఘాటించారు. రాష్ట్రంలోని అన్ని రంగాలు దిగ్విజయంగా వృద్ధి చెందాలని, ముఖ్యంగా తెలంగాణ యువతకు అద్భుతమైన ఉద్యోగ అవకాశాలు లభించాలని ఆశించారు. ప్రతి కుటుంబం ఈ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరుతూ, ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన పార్టీ శ్రేణులను ఆయన అభినందించారు.

# నేడు తెలంగాణ బడ్జెట్

## మధ్యాహ్నం 12 గంటలకు ప్రవేశపెట్టనున్న భట్టి..!



**హైదరాబాద్, మార్చి 19:** తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో కీలకమైన ఘట్టానికి ముహర్తం కుదిరింది. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రేపు వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. శుక్రవారం ఉదయం బడ్జెట్‌ను ప్రభుత్వం ఆవెూదించనుంది. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో మధ్యాహ్నం 12 గంటలకు బడ్జెట్‌ను ప్రవేశ పెడుతారు. శాసన మండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారంటీల ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండోసారి బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. నిరుడు మార్చి 19న రూ. 3.05 లక్షల కోట్లతో వార్షిక బడ్జెట్‌ను శాసన సభ ముందుంచిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈసారి అంకెల గారడీలు చేస్తారా? అభివృద్ధి, సంక్షేమానికి భారీగా కేటాయిస్తారా? అనేది రేపు మధ్యాహ్నం లోపు తెలియనుంది.

# రైతే రాజుగా ప్రజా పాలన

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో 70 శాతం కుటుంబాలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఆ ఉద్దేశంతోనే రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతులను రుణవిముక్తులను చేశామన్నారు. ఇప్పటివరకు రూ.18 వేల కోట్లు రైతు భరోసా కోసం ఖర్చు చేశామని, ఈ నెల 22న మరోసారి రైతు భరోసా నిధులను విడుదల చేయ-ంబోతున్నామని కీలక ప్రకటన చేశారు. ఈ నూతన సంవత్సరం రాష్ట్ర ప్రజలందరికీ శుభం కలగాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ప్రజా పాలన, భద్రాద్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 19 నుంచి 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న "ప్రజా పాలనలో రైతు ఉత్సవాలు" కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా వారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆ శాఖ కమిషనర్ హన్మంతరావు, భద్రాచలం ఆలయ ఈవో దామోదరరావు, ఆలయ ప్రధాన అర్చకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. రాబోయే రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం తరఫున నిర్వహించే తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.



# ప్రభుత్వ విప్‌లుగా ముగ్గురు ఎమ్మెల్యేలు

- రేవంత్ సర్కార్ వ్యూహాత్మక నిర్ణయం
- విజయరమణా రావు, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వేముల వీరేశం నియామకం
- సభా వ్యవహారాల సమన్వయం, ఓటింగ్ సమయంలో కీలక పాత్ర



**హైదరాబాద్, మార్చి 19:** శాసనసభలో ప్రభుత్వ కార్యకలాపాలను మరింత వేగవంతం చేసే దిశగా అధికార పక్షం కీలక నిర్ణయం తీసుకుంది. సభా వ్యవహారాలను సమర్థవంతంగా సమన్వయం చేసేందుకు వీలుగా అసెంబ్లీ విప్‌లుగా ముగ్గురు ఎమ్మెల్యేలను నియమిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కీలక బాధ్యతలను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దక్కించుకున్నారు.

### సభా నిర్వహణలో విప్‌లదే కీలక పాత్ర

శాసనసభలో ఏదైనా బిల్లుపై ఓటింగ్ జరిగినప్పుడు లేదా ముఖ్యమైన చర్చలు చేపట్టినప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలంతా తప్పనిసరిగా సభకు హాజరయ్యేలా చూ డటంలో విప్‌లదే ప్రధాన పాత్ర. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎవరూ ఓటు వేయకుండా పార్టీ విధించిన లైన్‌ను పక్కాగా అమలు చేయడం వీరి ముఖ్య బాధ్యత. రాబోయే బడ్జెట్ సమావేశాలు, కీలక సెషన్ల నేపథ్యంలో ఈ నియామకాలకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది.

### సభలో పట్టు కోసమే అనుభవజ్ఞులకు..

రాజకీయంగా మంచి అనుభవం ఉన్న ఈ నాయకులకు విప్ బాధ్యతలు అప్పగించడం ద్వారా సభలో ప్రభుత్వ పట్టును మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ప్రతిపక్షాల వ్యూహాలను దీటుగా ఎదుర్కొనేందుకు వీరికి బాధ్యతలు అప్పగించారు. ఈ కీలక పదవులు దక్కడం పట్ల నూతన విప్‌లు ముఖ్యమంత్రికి, పార్టీ అధిష్టానానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# అట్టహాసంగా గద్దర్ సినిమా అవార్డుల వేడుక

- హైటెక్స్ వేదికగా తారల సందడి.. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వ పురస్కారాలు
- ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి.. అవార్డుల ప్రదానం
- ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్న చిరంజీవి
- ఉత్తమ నటుడు నాగ చైతన్య.. ఉత్తమ నటి రష్మిక
- ఏపీ సీఎం చంద్రబాబు స్ఫూర్తి పొందాలన్న చిరంజీవి
- ఇవి గద్దర్ అవార్డులు కావు.. ఖద్దర్ అవార్డులన్న బీఆర్ఎస్



**హైదరాబాద్, మార్చి 19:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నెలకొల్పిన 'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం అట్టహాసంగా జరిగింది. దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రాష్ట్ర స్థాయిలో సినిమా పురస్కారాల పండుగ జరగడంతో సినీ ప్రమ-ుఖులు, తారలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మాదాపూ-ర్‌లోని హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ ఈ మెగా ఈవెంట్‌కు వేదికైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. అంతకుముందు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్డీసీ) ఛైర్మన్ దిల్ రాజు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు.

### ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

అవార్డుల ప్రదానోత్సవం మధ్యలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వనజ ఉదయ్ డాన్స్ బృందం తెలంగాణ సంప్రదాయాలను, సంస్కృతిని ప్రతిబింబించే అద్భుతమైన నృత్య ప్రదర్శనతో అలరించింది. ప్రఖ్యాత గాయని శ్రేయా ఘోషల్, రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ (డీఎస్పీ), జానపద గాయని మంగ్లీ తమ లైవ్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్‌తో కార్యక్రమానికి మరింత జోష్ తీసుకొచ్చారు. జ్యూరీ ఛైర్మన్ మణిశర్మ, సభ్యులు తమ్మారెడ్డి భరద్వాజ, తనికెళ్ల భరణి, రోజా రమణి తదితరులు వేదికపై ఆసీనులయ్యారు. బాలీవుడ్ నుంచి మాధురీ దీక్షిత్, రితేష్ దేశ్‌ముఖ్, జెనీలియా దంపతులు తదితరులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

### చంద్రబాబు స్ఫూర్తి తీసుకోవాలి.. చిరంజీవి

సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్న మెగాస్టార్ చిరంజీవి వేదికపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమా అవార్డులు కొన్నాళ్ళుగా నిర్లక్ష్యానికి గురయ్యాయని, రేవంత్ రెడ్డి చొరవతో మళ్లీ కళాకారులకు ప్రోత్సాహం లభిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. కళాకారులను ఉత్సాహపరచడంలో పక్క రాష్ట్రం కొంత వెనుకంజలో ఉందని, ఎప్పుడూ సినిమా వాళ్లకు దగ్గరగా ఉండే ఏపీ సీఎం చంద్రబాబు ఈ అవార్డుల వేడుకను చూసి స్ఫూర్తి పొందాలని చిరంజీవి సూచించారు. చిత్ర పరిశ్రమ అభివృద్ధికి రేవంత్ రెడ్డి ఏ బాధ్యత అప్పగించినా తీసుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. అనంతరం ప్రజా యుద్ధనౌక గద్దర్ కుమారుడు సూర్య కిరణ్ మాట్లాడుతూ.. తన తండ్రితో కలిసి పనిచేసిన వారి, చిరంజీవిలాంటి అగ్ర నటులు అవార్డులు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

### వివాదం రాజేసిన ఖద్దర్ వ్యాఖ్యలు

ఒకవైపు అవార్డుల పండుగ ఉత్సాహంగా సాగుతుండగా, మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ విమర్శలతో రాజకీయం వేడెక్కింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఈ అవార్డుల ఎంపికపై తీవ్ర విమర్శలు చేశారు. ఇవి 'గద్దర్' అవార్డులు కాదని, కాంగ్రెస్ పార్టీకి చెందిన 'ఖద్దర్' అవార్డులని ఆయన ఎద్దేవా చేశారు. రాజకీయ కారణాలతోనే తెలంగాణకు చెందిన పలువురు ప్రతిభావంతులను పక్కనపెట్టి, ఎక్కువగా ఆంధ్ర వాళ్లకే అవార్డులు కట్టబెట్టారని ఆరోపించారు. దీనిపై సోషల్ మీడియాలోనూ పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

### ప్రధాన అవార్డుల విజేతలు వీరే

ఎన్టీఆర్ జాతీయ పురస్కారం – చిరంజీవి
పైడి జయరాజ్ అవార్డు – కమల్ హాసన్
ఏఎన్ఆర్ అవార్డు – జయసుధ
నాగిరెడ్డి చక్రపాణి అవార్డు – అశ్వనీదత్
బీఎన్ రెడ్డి అవార్డు – సింగీతం శ్రీనివాసరావు
రఘుపతి వెంకయ్య అవార్డు – రమేష్ ప్రసాద్ (ప్రసాద్ ల్యాబ్స్)
కాంతారావు అవార్డు – ఆర్. నారాయణమూర్తి
సి. నారాయణ రెడ్డి అవార్డు – సుద్దాల అశోక్ తేజ

### సినిమాలు, నటీనటుల విభాగం

ఉత్తమ చిత్రం - రాజు వెడ్స్ రాంబాయి
ద్వితీయ ఉత్తమ చిత్రం - దండోరా
తృతీయ ఉత్తమ చిత్రం - ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో
ఉత్తమ నటుడు - నాగ చైతన్య (తండేల్)
ఉత్తమ నటి - రష్మిక మందన్న (ది గర్ల్ ఫ్రెండ్)
ఉత్తమ దర్శకుడు - సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ సహాయ నటుడు - శివాజీ (దండోరా)
ఉత్తమ సహాయ నటి - భూమిక (యుఫోరియా)
జాతీయ సమగ్రత చిత్రం - తండేల్
ఉత్తమ సందేశాత్మక చిత్రం - కోర్ట్
ఉత్తమ వినోదాత్మక చిత్రం - సంక్రాంతికి వస్తున్నాం
ఉత్తమ బాలల చిత్రం - అనగనగా
ఉత్తమ నూతన దర్శకుడు - సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్)
ఉత్తమ బాలనటుడు - మాస్టర్ రోహన్ (ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో)
ఉత్తమ హాస్యనటుడు - కృష్ణ తేజ (జిగ్రీస్)

### సాంకేతిక నిపుణుల విభాగం

ఉత్తమ సంగీత దర్శకుడు - మార్క్ కె. రాబిన్ (దండోరా)
ఉత్తమ గాయకుడు - అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ గాయని - సాహితీ చాగంటి (కన్నప్ప)
ఉత్తమ కథా రచయిత - గుణశేఖర్ (యుఫోరియా)
ఉత్తమ స్క్రీన్ ప్లే - అనిల్ రావిపూడి
ఉత్తమ గేయ రచయిత - నందకిశోర్ (కుబేర)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ - కార్తీక్ ఘట్టమనేని (మిరాయ్)
ఉత్తమ ఎడిటర్ - శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్)









# హాంకాంగ్ 'ఫిలిం మార్ట్'లో భారత్ జోరు

## ప్రపంచ వేదికపై సత్తా చాటిన 'భారత్ పావిలియన్'..

### గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్‌లే లక్ష్యం

**న్యూఢిల్లీ/హాంకాంగ్, మార్చి 19:** హాంకాంగ్‌లో అత్యంత వైభవంగా జరుగుతున్న 'అంతర్జాతీయ చలనచిత్ర–టీవీ మార్కెట్' (హాంకాంగ్‌ఫిల్మ్‌మార్ట్2026)లో భారత్ తన ప్రభావాన్ని బలంగా చాటుకుంది. ప్రపంచవ్యాప్తంగా మీడియా, వినోద రంగాల్లో భారత్ ఎదుగుతున్న తీరుకు అద్దం పడుతూ ఏర్పాటు చేసిన 'భారత్ పావిలియన్' పర్యాటకులను, అంతర్జాతీయ సినీ ప్రతినిధులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ పావిలియన్‌ను హాంకాంగ్‌లోని భారత కాన్సుల్ జనరల్ రాజేష్ నాయక్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్ నాయక్ మాట్లాడుతూ.. సినిమా, టీవీ, కొత్త మీడియా రంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హాంకాంగ్ ఫిలిం మార్ట్‌లో భారత ప్రతినిధుల భారీ భాగస్వామ్యం, మన వినోద రంగంపై ప్రపంచ దేశాలకు పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన సేవల ఎగుమతి ప్రోత్సాహ మండలి మరియు సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ) సంయుక్తంగా ఈ పావిలియన్‌ను నిర్వహించాయి. భారత్ పావిలియన్ వేదికగా సినిమాలు, యానిమేషన్, కొత్త మీడియా రంగాల వైవిధ్యాన్ని ప్రదర్శించడమే కాకుండా, అంతర్జాతీయ వ్యాపార సమావేశాలు మరియు సంయుక్త నిర్మాణాలపై కీలక చర్చలు జరిపారు. గ్లోబల్ కంటెంట్ మార్కెట్‌లో మారుతున్న అవకాశాలపై నిపుణులతో ప్రత్యేక చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. భారత సృజనాత్మక రంగాన్ని ప్రపంచ మార్కెట్‌కు చేరువ చేయడంలో ఎన్ఎఫ్‌డీసీ కీలక పాత్ర పోషిస్తోందని అధికారులు వెల్లడించారు.

### ప్రధాన వేదికలపై ప్రచారం

త్వరలో ముంబైలో జరగనున్న 'ముంబై ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్'లోని డాక్యుమెంటరీ, యానిమేషన్ ప్రాజెక్టులను ఈ వేదిక ద్వారా ప్రోత్సహించారు. అలాగే, నవంబర్‌లో గోవాలో జరగనున్న ప్రతిష్టాత్మక 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా' గురించి అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించారు. మొత్తంగా, ప్రభుత్వం మరియు పరిశ్రమల సమన్వయంతో ప్రపంచ మీడియా--వినోద రంగంలో భారత్ ఒక కీలక భాగస్వామిగా ఎదుగుతున్నదని ఈ హాంకాంగ్ పర్యటన ద్వారా స్పష్టమైంది.

# యువతి ప్రాణం కాపాడిన బాన్సువాడ సబ్ కలెక్టర్

## 60 అడుగుల ఎత్తైన వాటర్ ట్యాంక్ ఎక్కి కౌన్సెలింగ్..

### క్షేమంగా కిందకు దించిన డాక్టర్ కిరణ్మయి



**కామారెడ్డి, మార్చి 19:** కామారెడ్డి జిల్లా మహమ్మద్‌నగర్ మండలం బుర్గల్ గ్రామంలో గురువారం హైడ్రామా చోటుచేసుకుంది. కుటుంబ విభేదాల నేపథ్యంలో స్రవంతి అనే యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతూ గ్రామంలోని సుమారు 60 అడుగుల ఎత్తైన నీటి ట్యాంక్‌పైకి ఎక్కింది. ఈ సమాచారం అందుకున్న వెంటనే బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి వేగంగా స్పందించి ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి తీవ్రతను గమనించిన సబ్ కలెక్టర్, ఏమాత్రం తటపటాయించకుండా తానే స్వయంగా 60 అడుగుల ఎత్తైన ట్యాంక్ పైకి ఎక్కారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువతి వద్దకు వెళ్లి, ఆమెను ఓదార్చుతూ ఎంతో ఓపికగా కౌన్సెలింగ్ నిర్వహించారు. సుమారు గంటకు పైగా యువతితో చర్చలు జరిపి, ఆమెలో ధైర్యాన్ని నింపి, సమస్యలను పరిష్కరిస్తామని నమ్మకం కలిగించారు. సబ్ కలెక్టర్ మాటలతో శాంతించిన యువతి కిందకు దిగేందుకు అంగీకరించింది. ఎల్లారెడ్డి ఫైర్ స్టేషన్ సిబ్బంది, పోలీసులు, గ్రామ సర్పంచ్ మరియు స్థానిక పెద్దల సమన్వయంతో యు-వతిని ఎటువంటి ప్రమాదం లేకుండా సురక్షితంగా కిందకు దించారు. ప్రస్తుతం ఆ యువతి క్షేమంగా ఉందని అధికారులు తెలిపారు. ఒక ఉన్నతాధికారి హోదాలో ఉండి కూడా, ప్రాణాలకు తెగించి ట్యాంక్ ఎక్కి యువతిని కాపాడిన డాక్టర్ కిరణ్మయి సాహసాన్ని జిల్లా యంత్రాంగంతో పాటు స్థానిక ప్రజలు వేనోళ్ల కొనియాడుతున్నారు.




# డాడీ, మోడీ, చిన్నమోడీపైనే నా పోరు

- రామనవమికి కొత్త పార్టీ 'తెలంగాణ ప్రజా జాగృతి' ప్రకటన
- పార్టీ గుర్తుగా 'ధర్మ గంట' దాదాపు ఖరారు
- గాంధీజీ సర్వోదయ సిద్ధాంతంతో ప్రజల ముందుకు..
- బీఆర్ఎస్ తో నా ఇబ్బందులను వాడుకుంటున్న కాంగ్రెస్, రేవంత్
- జాగృతి అధ్యక్షురాలు కవిత..
- పార్టీ రిజిస్ట్రేషన్ పై త్వరగా తేల్చండి.. ఈసీకి ఢిల్లీ హైకోర్టు ఆదేశం



**హైదరాబాద్, మార్చి 19:** కొత్త రాజకీయ పార్టీ నమోదు వ్యవహారంలో కల్వకుంట్ల కవితకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో నూతన రాజకీయ పార్టీ నమోదు కోసం ఆమె గతంలో కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీకి) దరఖాస్తు చేసుకున్నారు. ఈ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందంటూ కవిత తాజాగా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. గురువారం ఈ పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం.. కవిత దరఖాస్తుపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈసీకి సూచించింది. దరఖాస్తులో ఉన్న సాంకేతిక లోపాలను సరిచేసి మళ్లీ సమర్పించామని కవిత తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలపగా, త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ఈసీ వెల్లడించింది. దీంతో కోర్టు విచారణను ముగించింది.

### సంచలన వ్యాఖ్యలు చేసిన కవిత

బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఉగాది వేడుకల సందర్భంగా కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. "డాడీ, మోడీ, చిన్నమోడీలపైనే నా పోరాటం" అని ఆమె ప్రకటించారు. కొత్త పార్టీ అజెండాపై కసరత్తు ముమ్మరంగా సాగుతోందని, గాంధీజీ సర్వోదయ సిద్ధాంతాన్ని లోతుగా అధ్యయనం చేస్తున్నానని తెలిపారు. మంచి ముహూర్తం చూసుకుని కొత్త పార్టీని అధికారికంగా ప్రకటిస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తో తనకు ఉన్న ఇబ్బందులను కాంగ్రెస్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని ఆమె మండిపడ్డారు.

### రామనవమికి 'ధర్మ గంట' మోగనుందా?

రానున్న శ్రీరామనవమి పండుగ రోజున పార్టీ పేరుతో పాటు గుర్తును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. కొత్త పార్టీకి 'తెలంగాణ ప్రజా జాగృతి' అనే పేరును దాదాపు ఖరారు చేశారు. పార్టీ గుర్తుగా 'ధర్మ గంట'ను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. పార్టీని ప్రారంభించగానే తమ అజెండా, భవిష్యత్తు లక్ష్యాలను ప్రజల ముందుకు తీసుకువస్తానని కవిత ఉద్ఘాటించారు.

# కాంగ్రెస్ సీనియర్లకే ఆ 'తొక్కుడు' హెచ్చరిక

- రేవంత్ భాషపై బండి సంజయ్ నిప్పులు!
- వందేమాతరాన్ని అవమానిస్తే చర్యలేవి?
- ఎంఐఎం మెడలు వంచుతాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ధ్వజం



**కరీంనగర్, మార్చి 19:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చేసిన 'తొక్కుకుంటూ వచ్చా' అనే వ్యాఖ్యలు ప్రత్యర్థులపై కంటే, కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ నాయకులను ఉద్దేశించి చేసిన హెచ్చరికల్లా ఉన్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. గురువారం కరీంనగర్‌లోని తన నివాసంలో కార్యకర్తలు, మీడియాతో కలిసి ఆయన ఉగాది వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై, స్పీకర్ తీరుపై ఆయన కరుకు విమర్శలు చేశారు. "ప్రజలు ఆశీర్వదిస్తే ముఖ్యమంత్రి అయ్యానని చెప్పాల్సింది పోయి, అందరినీ తొక్కుకుంటూ వచ్చానని రేవంత్ అనడం సిగ్గుచేటు. కాంగ్రెస్‌లో అసమ్మతి గళం విప్పుతున్న సీనియర్ నేతలను భయపెట్టడానికే ఆయన ఈ భాష వాడుతున్నారు" అని సంజయ్ విమర్శించారు. సీఎం వాడుతున్న భాషను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతల తీరు కూడా అలాగే ఉందని మండిపడ్డారు. ఈ రెండు పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని, అందుకే ఒకరి అవినీతిపై మరొకరు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. శాసనసభలో వందేమాతరం గేయ ఆలాపనను ఎంఐఎం సభ్యులు బహిష్కరించడంపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "జాతీయ గేయాన్ని అవమానించినా ముఖ్యమంత్రి, మంత్రులు ఎందుకు స్పందించడం లేదు? సభ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌కు లేదా? బీజేపీ అధికారంలో ఉంటే ఎంఐఎం నేతలను కటకటాల్లోకి నెట్టేవాళ్లం. భవిష్యత్తులో మేం అధికారంలోకి వస్తే నిద్రలో కూడా వందేమాతరం గుర్తుండేలా వారి మెడలు వంచుతాం" అని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను వంచిస్తోందని బండి సంజయ్ ధ్వజమెత్తారు. "రైతు భరోసా పేరుతో రేవంత్ సర్కార్ రైతులకు రూ. 41 వేల కోట్లు బాకీ పడింది. ఒక్కో రైతుకు ఎకరాకు రూ. 30 వేలు, వ్యవసాయ కూలీలకు రూ. 36 వేల చొప్పున బకాయిలు ఇవ్వాలి. ఈ నెల 22న నర్మెట్టలో జరిగే కార్యక్రమంలోగా ఈ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయాలి. లేదంటే రైతులు మంత్రులను, ఎమ్మెల్యేలను గల్లా పట్టి నిలదీయాలి" అని పిలుపునిచ్చారు. మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని, అయితే పేదల ఇళ్లను కూల్చి రోడ్డున పడేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. "గుజరాత్‌లోని సబర్మతి నది తరహాలో ప్రక్షాళన చేయండి. ముందుగా బాధితులకు ఇళ్లు కట్టించి, అన్ని సౌకర్యాలు కల్పించిన తర్వాతే పనులు ప్రారంభించాలి. పేదల ఇళ్లు కూల్చి గాంధీ విగ్రహం పెడతామంటే ఆ మహాత్ముడి ఆత్మ క్షోభిస్తుంది" అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ తనపై నమ్మకంతో అత్యంత కీలకమైన హోంశాఖను అప్పగించారని, దీనిపై విమర్శలు చేసే ముందు శాఖ ప్రాముఖ్యత తెలుసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబుకు కౌంటర్ ఇచ్చారు.

# ప్రభుత్వ వైఫల్యాలు ప్రతిపక్షానికి బలం!


- తెలంగాణ భవన్‌లో పంచాంగ శ్రవణం..
- కేటీఆర్ సమక్షంలో పండితుల విశ్లేషణ




**హైదరాబాద్, మార్చి 19:** తెలంగాణ భవన్‌లో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ పాల్గొన్నారు. ప్రముఖ సిద్ధాంతి మృత్యుంజయ శర్మ గారు, ఫణీంద్ర శర్మ గారు పంచాంగ శ్రవణం చేస్తూ, రాబోయే ఏడాదిలో రాష్ట్ర, దేశ రాజకీయ, సామాజిక పరిస్థితులపై కీలక అంచనాలను వెల్లడించారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్న లోటుపాట్లు, పాలనా వైఫల్యాలు కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, అది ప్రతిపక్షానికి రాజకీయంగా పెద్ద ఎత్తున బలాన్ని చేకూరుస్తుందని పండితులు అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైతే, ప్రత్యామ్నాయ శక్తిగా ప్రతిపక్షం ఎదిగేందుకు బలమైన పరిస్థితులు ఉన్నాయని స్పష్టం చేశారు. విద్యా విధానంలో వస్తున్న మార్పుల వల్ల విద్యార్థులకు నష్టం కలిగే ప్రమాదం ఉందని, నిరుద్యోగ సమస్య పెరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వసాయ రంగానికి ఈ ఏడాది అనుకూలంగా ఉంటుందని పండితులు అంచనా వేశారు. సమృద్ధిగా వర్షాలు కురిసి, చెరువులు, జలాశయాలు నిండిపోతాయని.. ధాన్యం, పత్తి, మక్క వంటి పంటలు బాగా పండుతాయని తెలిపారు. దీనివల్ల రైతుల ఆత్మహత్యలు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే, బంగారం, వెండి మరియు ఆహార ధాన్యాల ధరలు పెరిగే సూచనలు ఉన్నాయని, కూరగాయల ధరలు మాత్రం కొంతవరకు తగ్గుముఖం పట్టవచ్చని వెల్లడించారు.

### అంతర్జాతీయ పరిస్థితులు.. జాగ్రత్తలు

దేశ సైన్యం విదేశీ కుట్రలను సమర్థవంతంగా ఎదుర్కొంటుందని, అయితే పొరుగు దేశాలతో స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకోవచ్చని పండితులు తెలిపారు. అగ్ని, వాహన ప్రమాదాలు మరియు దొంగతనాలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ గౌరవం పెరుగుతుందని, వాణిజ్య రంగంలో దేశం రాణిస్తుందని పేర్కొన్నారు. పంజాబ్ వంటి ప్రాంతాల్లో ప్రకృతి ప్రకోపాలు ఉండే సూచనలు ఉన్నాయని, రాజకీయ, సినీ రంగాల్లోని కొందరు ప్రముఖులు కనుమరుగయ్యే అవకాశం ఉందని కూడా వారు అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు మరియు పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని ఉగాది పూజలు నిర్వహించారు.






# నిఫ్టీ డౌన్.. సెన్సెక్స్ క్రాష్

## మార్కెట్లను కుదిపేసిన 'యుద్ధ' మేఘాలు

## 2496 పాయింట్లు పతనమైన సెన్సెక్స్

### భగ్గుమన్న చమురు ధరలు.. 115 డాలర్లకు బ్రెంట్ క్రూడ్

### అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల యథాతథ నిర్ణయంతో నిరాశ

### చైర్మన్ రాజీనామాతో కుప్పకూలిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు

### రూ.13 లక్షల కోట్లు ఆవిరైన మదుపర్ల సంపద

**ముంబయి, మార్చి 19:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ వాతావరణం భారతీయ స్టాక్ మార్కెట్లను తీవ్రంగా కుదిపేసింది. ఇరాన్ దాడుల నేపథ్యంలో చమురు ధరలు మండిపోవడం, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను స్థిరంగా కొనసాగించడం దలాల్ స్ట్రీట్‌పై తీవ్ర ప్రభావం చూపాయి. వరుసగా మూడు రోజుల పాటు లాభాల బాటలో పయనించిన సూచీలు భారీగా పతనమయ్యాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.13 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.426 లక్షల కోట్లకు పడిపోయింది. ఉదయం లావాదేవీలు ప్రారంభమైనప్పటి నుంచే మార్కెట్లు నష్టాల బాట పట్టాయి. సెన్సెక్స్ 74,750.92 పాయింట్ల వద్ద ప్రారంభమై, ఓ దశలో 2700 పాయింట్ల మేర పతనమైంది. ఇంట్రాడేలో 73,950.95 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 2496.89 పాయింట్లు నష్టపోయి 74,207.24 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 775.65 పాయింట్లు పడిపోయి 23,002.15 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలోని అన్ని షేర్లూ నష్టాల్లోనే ముగిశాయి. ఎటర్నల్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా, ఎల్అండ్‌టీ షేర్లు ప్రధానంగా పడిపోయాయి.

#### పతనానికి ప్రధాన కారణాలు ఇవే..

ఖతార్‌లోని అత్యంత కీలకమైన రస్ లాఫాన్ పారిశ్రామిక ప్రాంతంపై ఇరాన్ క్షిపణి దాడికి పాల్పడింది. ఖతార్ ఆర్థిక వ్యవస్థకు ఈ గ్యాస్ క్షేత్రమే పునాది. ఇక్కడి నుంచే భారత్ అత్యధికంగా ఎరువులు, సీఎన్‌జీ, పీఎన్‌జీ అవసరాలు తీర్చుకుంటోంది. భారత్ కొనుగోలు చేసే ఎల్ఎన్‌జీలో 47 శాతం ఖతార్ నుంచే వస్తుంది. దీనికి తోడు సౌదీ అరామ్‌కో రిఫైనరీలపైనా ఇరాన్ డ్రోన్ దాడులు జరిపింది. ఈ పరిణామాలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ 115 డాలర్ల మార్కును తాకాయి. బంగారం ఔన్సు 4700 డాలర్ల స్థాయికి చేరింది.


#### నిరాశపరిచిన ఫెడ్ నిర్ణయం

అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. ద్రవ్యోల్బణం ఇంకా అదుపులోకి రాలేదని ఫెడ్ చీఫ్ జెరోమ్ పావెల్ స్పష్టం చేశారు. దీంతో అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఈ ప్రభావం ఆసియా మార్కెట్లపై కూడా పడింది. అమెరికా బాండ్ల రాబడులు మళ్లీ పెరగడం ఈక్విటీ మార్కెట్లకు ప్రతికూలంగా మారింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాత్కాలిక ఛైర్మన్ అతాను చక్రవర్తి అకస్మాత్తుగా రాజీనామా చేశారు. దీంతో ఆ బ్యాంక్ షేర్లు 9 శాతం మేర కుప్పకూలాయి. సూచీలో ఈ స్టాక్‌కు అధిక వెయిటేజీ ఉండటం మొత్తం మార్కెట్ పతనానికి దారి తీసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐ) అమ్మకాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఏకంగా రూ.2714 కోట్ల విలువైన షేర్లను వీరు విక్రయించారు. వరుసగా 14 రోజులుగా వీరు నెట్ సెల్లర్లుగా మిగలడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో బెంచ్ మార్క్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా ప్రతికూల పవనాలు వీస్తుండటంతో, పెట్టుబడిదారులు తమ లాభాలను నగదుగా మార్చుకునేందుకు మొగ్గు చూపారు.




# ఇరాన్‌తో పోరు తదుపరి దశకు..

**ముంబయి, ఏప్రిల్ 20:** ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం ఇప్పుడే సద్దుమణిగే అవకాశాలు కన్పించడం లేదు. ఇరాన్‌తో జరుగుతోన్న పోరును తదుపరి దశకు తీసుకెళ్లేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగా వేలాదిగా యూఎస్ బలగాలను పశ్చిమాసియాకు తరలించాలని యోచిస్తున్నట్లు సమాచారం. అమెరికా అధికారులు ఈ విషయం తెలిపినట్లు రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది. దాని ప్రకారం.. 'పశ్చిమాసియాలో తమ కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు వేలాది మంది సైనికులను అక్కడ మోహరించాలని ప్రభుత్వం యోచిస్తోంది' అని ఆ అమెరికా అధికారి పేర్కొన్నారు. వైమానిక, నావికాదళాల ద్వారా హర్మూజ్ జలసంధి మీదుగా చమురు ట్యాంకర్ల రవాణాకు రక్షణ కల్పించే విషయంపైనా ప్రభుత్వం చర్చలు జరిపినట్లు వెల్లడించారు. అయితే, ఇందుకోసం ఇరాన్ తీర ప్రాంతంలో యూఎస్ సైన్యాన్ని మోహరించాల్సి రావచ్చన్నారు. వీటితో పాటు ఇరాన్ చమురు ఎగుమతులకు కీలకమైన ఖర్గ్ ద్వీపానికి యూఎస్ బలగాలను పంపే విషయంపైనా మాట్లాడుకున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ఆపరేషన్ అత్యంత ప్రమాదకరమైనదని యూఎస్ అధికారి ఒకరు హెచ్చరించారు. ఈ ప్రణాళికలన్నింటిపై చర్చలు జరిగినప్పటికీ.. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. కాగా.. ఈ చర్చల విషయంపై పెంటగాన్ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇలాఉండగా.. గతనెల 28న యుద్ధం ప్రారంభమైనప్పటినుంచి ఇరాన్‌పై 7,800కు పైగా దాడులు చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఈ క్రమంలో ఇప్పటివరకు ఇరాన్‌కు చెందిన 120 నౌకలను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకు 13 మంది యూఎస్ సైనికులు మరణించగా.. సుమారు 200 మంది గాయపడినట్లు తెలిపింది.



- వేలాదిగా పశ్చిమాసియాకు యూఎస్ బలగాలు?
- ఇరాన్ చమురు ఎగుమతులపై దెబ్బకొట్టేందుకు యూఎస్ ప్రణాళిక?
- హర్మూజ్ జలసంధిలో చమురు ట్యాంకర్లకు రక్షణ కల్పించాలని అమెరికా యోచన.
- ఇరాన్ తీరంలో సైన్యాన్ని మోహరించే అవకాశం.. ఖర్గ్ ద్వీపం కూడా లక్ష్యం.
- చర్చలు జరిగాయి, తుది నిర్ణయం తీసుకోలేదన్న యూఎస్ అధికారులు.

# ప్రపంచ ఇంటర్నెట్ వ్యవస్థకు ముప్పు




- ఎర్ర సముద్రంలో డేటా కేబుళ్లపై హౌతీల గురి!
- ఆసియా, యూరప్‌లను కలిపే ప్రధాన కనెక్టివిటీపై డేంజర్ బెల్స్
- అండర్ సీ కేబుళ్లు కట్ అయితే ఆగిపోనున్న అంతర్జాతీయ బ్యాంకింగ్
- కుప్పకూలనున్న స్టాక్ మార్కెట్లు.. నిలిచిపోనున్న డిజిటల్ సేవలు
- యుద్ధ వాతావరణంతో మరమ్మతులకు అడ్డంకులు.. పునరుద్ధరణకు నెలల సమయం
- ఆధునిక చరిత్రలో తొలిసారి ఇంధన, డిజిటల్ వ్యవస్థలకు ఒకేసారి గండం

**ముంబయి, మార్చి 19:** ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ కూటమి మధ్య మూడో వారానికి చేరిన యుద్ధం సరికొత్త డిజిటల్ సంక్షోభానికి దారితీస్తోంది. ఆధునిక ప్రపంచానికి ప్రాణాధారమైన అంతర్జాతీయ ఇంటర్నెట్ వ్యవస్థ తీవ్ర ప్రమాదంలో పడింది. ఎర్ర సముద్రం (రెడ్ సీ) అడుగున ఉన్న అంతర్జాతీయ డేటా కేబుళ్లను (అండర్ సీ కేబుల్స్) లక్ష్యంగా చేసుకుని యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్ దాడులకు వ్యూహరచన చేస్తున్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇంటర్నెట్ కనెక్టివిటీపై పొంచి ఉన్న ఈ ముప్పు ప్రపంచ దేశాలను వణికిస్తోంది.

#### కట్ అయితే బ్లాక్ అవుటే..

ఆసియా, యూరప్ ఖండాలను అనుసంధానించే ప్రధాన ఇంటర్నెట్ కేబుళ్లు ఎర్ర సముద్రం గుండానే వెళ్తాయి. ఒకవేళ హౌతీల దాడుల్లో ఈ కేబుళ్లు దెబ్బతింటే ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలు స్తంభించిపోతాయి. డిజిటల్ కనెక్టివిటీ తెగిపోవడంతో అంతర్జాతీయ బ్యాంకింగ్ లావాదేవీలు ఎక్కడికక్కడే నిలిచిపోతాయి. క్షణాల్లో జరిగే స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ కుప్పకూలే ప్రమాదం పొంచి ఉంది. గ్లోబల్ డేటా ట్రాన్స్‌ఫర్ ఆగిపోతే ఆర్థిక వ్యవస్థలు కోలుకోలేని దెబ్బతింటాయి.

#### మరమ్మతులు కూడా అసాధ్యమే..

డేటా కేబుళ్లు తెగిపోయిన పక్షంలో వాటిని సరిచేయడం ఇప్పుడున్న పరిస్థితుల్లో అసాధ్యంగా మారింది. యుద్ధం భీకరంగా జరుగుతున్న సముద్ర ప్రాంతాల్లోకి కేబుల్ మరమ్మతు నౌకలు వెళ్లే పరిస్థితి అస్సలు లేదు. దాడుల వల్ల ఇంటర్నెట్ కేబుల్స్ కట్ అయితే, వాటిని పునరుద్ధరించడానికి నెలల సమయం పడుతుందని నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ చీకట్లలోకి ప్రపంచం వెళితే ఎదురయ్యే నష్టాన్ని అంచనా వేయడం కూడా కష్టమే.

#### చమురు మంటలకు తోడు డిజిటల్ గండం

ఇప్పటికే హోర్ముజ్ జలసంధిని ఇరాన్ పాక్షికంగా దిగ్బంధించడంతో చమురు సరఫరాకు తీవ్ర విఘాతం ఏర్పడింది. రికార్డు స్థాయిలో బ్యారెల్ చమురు ధర 126 డాలర్లకు చేరుకుంది. గల్ఫ్ దేశాల నుంచి ఆసియా, యూరప్ దేశాలకు వెళ్లే ట్యాంకర్లు నిలిచిపోయాయి. ఒకవైపు చమురు సరఫరా ఆగిపోయి ఆర్థిక భారం పెరుగుతుండటం, మరోవైపు డిజిటల్ కనెక్టివిటీ దెబ్బతినే ముప్పు పొంచి ఉండటం గుబులు పుట్టిస్తోంది. ఆధునిక ప్రపంచ చరిత్రలో ఇంధన, డిజిటల్ కనెక్టివిటీ వ్యవస్థలు రెండూ ఒకేసారి ఇలా దెబ్బతినడం ఇదే తొలిసారి కావచ్చని పొలిటికల్ అనలిస్టులు చెబుతున్నారు.

# రైల్వే ప్రయాణికులకు 'క్వాలిటీ' భరోసా..

- ఆహార నాణ్యతపై కేంద్రం కీలక నిర్ణయం
- అనధికార విక్రయాలకు చెక్..
- విక్రేతలకు క్యూఆర్ కోడ్ ఐడీ తప్పనిసరి
- మంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, మార్చి 19:** దేశవ్యాప్తంగా రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కేంద్ర రైల్వే శాఖ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. రైళ్లలో అనధికార విక్రయాలను అరికట్టడంతో పాటు, ప్రయాణికులకు అత్యంత పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా కొత్త విధానాలను అమలు చేస్తున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రైల్వే చట్టం 1989 (సెక్షన్ 144) ప్రకారం అనుమతి లేని వ్యక్తులు వస్తువులు అమ్మడం శిక్షార్హమైన నేరమని స్పష్టం చేసిన మంత్రి, ఇకపై రైళ్లలో పనిచేసే అధికారిక విక్రేతలకు క్యూఆర్ కోడ్ ఉన్న గుర్తింపు కార్డులను తప్పనిసరి చేశారు. ఈ కోడ్ స్కాన్ చేయడం ద్వారా విక్రేత పేరు, ఆధార్ వివరాలు, మెడికల్ ఫిట్‌నెస్ మరియు పోలీస్ వెరిఫికేషన్ వంటి సమాచారాన్ని అధికారులు మరియు ప్రయాణికులు సులభంగా తెలుసుకోవచ్చు. అదేవిధంగా ఆహార ప్యాకెట్లపై కూడా క్యూఆర్ కోడ్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆహార నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకుండా రైల్వే శాఖ పలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఆధునిక బేస్ కిచెన్లలోనే ఆహార తయారీ జరిగేలా చూడటంతో పాటు, అక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించనున్నారు. ప్రతి క్యాటరింగ్ యూనిట్‌కు ఎఫ్ఎస్ఎస్ఏఐ ధృవీకరణను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. నాణ్యతను పరీక్షించేందుకు తరచూ ఆహార నమూనాల సేకరణ, థర్డ్ పార్టీ ఆడిట్లు మరియు ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నారు. కేటరింగ్ సిబ్బందికి వ్యక్తిగత పరిశుభ్రత, సేవా నైపుణ్యాలు మరియు మర్యాదపూర్వక ప్రవర్తనపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పాంట్రీ కార్లలో శుభ్రతను, పురుగుల నివారణ చర్యలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక పర్యవేక్షకులను నియమించడమే కాకుండా, ప్రయాణికుల నుంచి నేరుగా అభిప్రాయాలను సేకరించనున్నారు. రైల్వే వ్యవస్థలో అనధికార విక్రేతలను పూర్తిగా అడ్డుకుని, ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణ అనుభవాన్ని మరియు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.



# దేశవ్యాప్తంగా 100 పారిశ్రామిక పార్కులు

#### 'భవ్య' పథకానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్!

**న్యూఢిల్లీ, మార్చి 19:** దేశంలో పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన నిర్ణయం తీసుకుంది. వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో "భవ్య" పథకాన్ని అమలు చేసేందుకు జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి సంస్థ సన్నద్ధమవుతోంది. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 100 అత్యాధునిక పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసే పారిశ్రామికవేత్తలకు ఎటువంటి జాప్యం లేకుండా, భూమి అనుమతులు, మౌలిక సదుపాయాలు ముందే సిద్ధంగా ఉండేలా "తయారుగా వినియోగానికి సిద్ధమైన" పార్కులను ఈ పథకం కింద రూపొందించనున్నారు. దీనివల్ల పరిశ్రమలు త్వరితగతిన కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలవుతుంది. అంతేకాకుండా, సింగిల్‌విండో విధానం ద్వారా అన్ని రకాల అనుమతులను త్వరితగతిన మంజూరు చేసే వ్యవస్థను ఈ పార్కుల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రధానమంత్రి గతిశక్తి మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా, ఈ పారిశ్రామిక పార్కులకు రహదారి, రైలు మరియు సరకు రవాణా సౌకర్యాలను చివరి దశ వరకు కల్పించనున్నారు. పర్యావరణ హితానికి ప్రాధాన్యతనిస్తూ.. భూగర్భ సదుపాయాలు, నీటి పునర్వినియోగ ప్లాంట్లు, పచ్చ విద్యుత్ వంటి సుస్థిర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం ఎన్ఐసీడీసీ దేశంలోని 13 రాష్ట్రాల్లో 20 ప్రాజెక్టులను విజయవంతంగా అమలు చేస్తోంది.

#### పెట్టుబడుల స్వర్గధామాలుగా నగరాలు

ఇప్పటికే ధోలేరా, షేంద్ర–బిడ్కిన్, విక్రం ఉద్యోగపురి, గ్రేటర్ నోయిడా వంటి పారిశ్రామిక నగరాలు అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షిస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. అదే ఉత్సాహంతో వస్త్ర రంగానికి సంబంధించి 'పీఎం మిత్ర' పార్కుల అభివృద్ధిలో కూడా కేంద్రం భాగస్వామ్యం వహిస్తోంది. 'భవ్య' పథకం అమలుతో దేశంలో పెట్టుబడులు వెల్లువెత్తడమే కాకుండా, లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

# స్టార్ హెల్త్ మంచిర్యాల బ్రాంచ్ ఆధ్వర్యంలో వేడుకలు



**మంచిర్యాల జిల్లా,, మార్చి 19, నేటి సాక్షి :** ఉగాది పరాభవ నామ నూతన సంవత్సరాన్నీ పురస్కరించుకొని స్టార్ హెల్త్ మంచిర్యాల బ్రాంచ్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించుకోవడం నిర్వహించరు ఈ సందర్భంగా స్టార్ హెల్త్ మంచిర్యాల మేనేజర్ ముస్కార సంపత్ మాట్లాడుతూ ఉగాది పండగ తెలుగు ప్రజలకు ఎంతో ముఖ్యమైన పండగ అని పండగలో అనేక నూతన నిర్ణయాలను తీసుకుంటారని కొనియాడారు అదేవిధంగా ఉగాది పరాభవ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంచిర్యాలలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కొనియాడారు ఉగాది నీ పురస్కరించుకొని స్టార్ హెల్త్ లో హెల్త్ ఇన్సూరెన్స్ కి సంబంధించిన సామాన్య ప్రజలకి అందుబాటులో ఉండే అనేక నూతన పాలసీలో తీసుకువచ్చిందని ప్రస్తుతం సామాన్య ప్రజలు హెల్త్ విషయంలో కొంచెం నిర్లక్ష్యం చేస్తున్నారని ఏదైనా సమస్య వచ్చినప్పుడు ప్రైవేట్ హాస్పిటల్ లో జాయిన్ అయితే లక్షల్లో ఖర్చు అవుతుందని దీనిని అధిగమించడానికి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రజలందరూ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలో చేసుకోవాలని అందరిని ఉగాది సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల బ్రాంచ్ సీనియర్ సేల్స్ మేనేజర్స్ ఏజెంట్స్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం నిర్వహణ



**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్ :** జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో "శ్రీ పరాభ" నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆసిఫాబాద్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ బాలాజీ వరప్రసాద్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ బంధువులకు "శ్రీ పరాభ" నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం బాలేష్, బీసీ యువజన సంఘం ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడు బొట్టుపల్లి ప్రశాంత్, మండల అధ్యక్షుడు సిరికొండ సాయి కృష్ణ (సిటీ కింగ్), యువజన సంఘం మండల అధ్యక్షుడు వైరాగడే రమేష్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు, ఎస్టీయూ సంఘం జిల్లా అధ్యక్షుడు సి. హెచ్. సంజీవ్, ఆసిఫాబాద్ సింగల్ విండో వైస్ చైర్మన్ రుకుం ప్రహ్లాద్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు షిండే నాందేవ్, నికురే హనుమంతు, ఇరుకుల్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలకు ఉగాది పచ్చడి పంపిణీ చేసి నూతన సంవత్సరాన్ని సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు.

# వార్డులో తీరిన నీటి కష్టాలు



**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మార్చి 19:** పట్టణంలోని 16వ వార్డులో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. వార్డులోని వాటర్ మోటార్ పనిచేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించిన 16వ వార్డు కౌన్సిలర్ దూడల లక్ష్మి, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, అధికారుల సహకారంతో నూతన వాటర్ మోటార్ ఏర్పాటు చేయించారు. గురువారం మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, కౌన్సిలర్ దూడల లక్ష్మి కలిసి వార్డులో కొత్త మోటార్‌ను ఏర్పాటు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సమస్యపై తక్షణమే స్పందించి కొత్త మోటార్ ఏర్పాటు చేసిన కౌన్సిలర్ దూడల లక్ష్మికి, మున్సిపల్ పాలకవర్గానికి వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు దూడల అశోక్, ఇప్ప నాగరాజు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఉగాది వేడుకల్లో చిన్నారుల ఉత్సాహం

## మండలంలో ఘనంగా ఉగాది ఉత్సవం



**నేటి సాక్షి, ఎండపల్లి:** మండలంలో శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది పర్వదినం గురువారం పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా పండుగ శోభతో ఇళ్ల ముందు ముగ్గులు, మామిడి తోరణాలతో వాతావరణం కళకళలాడింది. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి, ఉగాది ప్రాముఖ్యతను తెలియజేసే పాటలు, నృత్యాలు ప్రదర్శిస్తూ ఉత్సాహంగా సందడి చేశారు. సంప్రదాయంలో భాగంగా కుటుంబ సభ్యులు చిన్నారుల మెడలో కుడుక, చెక్కర పేర్ల దండ వేయడంతో వారు ఆనందంగా మురిసిపోయిన దృశ్యాలు పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్దలు ఉగాది పండుగ విశిష్టతను వివరిస్తూ తెలుగు ప్రజలకు కొత్త సంవత్సర ఆరంభం అని, పండగ రోజున పంచాంగ శ్రవణం వినడం, ఉగాది పచ్చడి సేవించడం ఆనవాయితీగా కొనసాగుతుందన్నారు. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు జీవితంలోని సుఖ--దుఃఖాలను సూచిస్తాయని తెలిపారు. గ్రామాల్లో పెద్దలు, యువత, చిన్నారులు కలిసి ఆనందంగా పండుగను జరుపుకోవడంతో సామూహిక ఉత్సాహం కనిపించింది. పండుగ సందర్భంగా పరస్పరం శు భాకాంక్షలు తెలియజేసుకుంటూ కొత్త ఆశయాలతో ముందుకు సాగాలని సంకల్పించారు.

# ఘనంగా శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు



- గ్రామ గ్రామాన ఉగాది పచ్చడి పంపిణీ.....
- పసుపుల గ్రామ సర్పంచ్ నర్మదా రవికుమార్ గౌడ్.....

**నేటి సాక్షి నారాయణపేట, మార్చ్ 20, ( రిపోర్టర్ ఇమామ్ సాబ్ ) :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని పసుపుల గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకొని శ్రీ శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మీకు మరియు మీ కుటుంబ సభ్యులకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాదిగ శుభాకాంక్షలను పసుపుల గ్రామ సర్పంచ్ నర్మదా రవికుమార్ గౌడ్ తెలిపారు. పసుపుల గ్రామంలోని స్వామివారి ఆలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అయ్యవారు మాట్లాడుతూ..... గ్రామంలో తెలుగు నూతన సంవత్సరాది అయిన ఈ ఉగాది, మీ జీవితంలో కొత్త వెలుగులను, అపారమైన సంతోషాన్ని, మరియు ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని కోరుకుంటున్నాను. ఈ పండుగ సందర్భంగా మీ కోసం కొన్ని ప్రత్యేక శుభాకాంక్షలు: జీవన పాఠం: ఉగాది పచ్చడిలోని షడ్రుచులు (తీపి, పులుపు, కారం, ఉప్పు, చేదు, వగరు) మన జీవితంలోని సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించాలని నేర్పిస్తాయి. మీ జీవితం కూడా ఈ ఆరు రుచుల కలయికలా సాఫీగా సాగిపోవాలని ఆశిస్తున్నాను. కొత్త ఆశలు: గడచిన కాలం చేదు అనుభవాలను మరచి, కొత్త ఆశలు మరియు లక్ష్యాలతో ఈ ఏడాదిని ఉత్సాహంగా ప్రారంభించండి. ప్రకృతి పండుగ: మామిడి తోరణాలు, వేప పూత, మరియు కొత్త చిగురులతో ప్రకృతి పులకరించే ఈ వేళ, మీ ఇల్లు కూడా ఆనంద డోలికలతో నిండాలని కోరుకుంటున్నాను. మీ ఆత్మీయులకు పంపడానికి కొన్ని సందేశాలు:"శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు! ఈ ఏడాది మీకు అంతా మంచే జరగాలి." "షడ్రుచుల ఉ గాది మీ జీవితంలో సకల శుభాలు కలిగించాలని మనసారా కోరుకుంటూ.. అందరికి ఉగాది శుభకాంక్షలు. ఈ పూజా కార్యక్రమంలో పసుపుల గ్రామస్తులతో పాటు నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా వివిధ గ్రామాలలోని వివిధ దేవాలయాల వద్ద పూజా కార్యక్రమాలను ఆయా గ్రామ సర్పంచ్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ గ్రామాల సర్పంచ్ల, సంఘాల, దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో పచ్చడి కార్యక్రమాన్ని నిర్వహించారు.

# కాగజ్‌నగర్‌లో జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు



**నేటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి మార్చ్ 19 :** కాగజ్‌నగర్‌లోని సిర్‌సిల్క్ ఎఫ్ కాలనీలో ఈ నెల 19వ తేదీన జూనియర్. యువకుల బాలురు మరియు బాలికల కోసం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఎంపికల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మార్చి 22, 23, 24 తేదీలలో హైదరాబాద్‌లోని షైఖ్‌పేట్‌లో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం కల్పించబడుతుంది.

### వివరాలు

వేదిక: కాగజ్‌నగర్, సిర్‌సిల్క్ ఎఫ్ కాలనీ రిపోర్టింగ్ సమయం: ఉదయం 8:00 గంటలకు వయస్సు పరిమితి (జనన సంవత్సరం ఆధారంగా): అండర్-17 బాలురు / బాలికలు: 2010-11 అండర్-19 బాలురు / బాలికలు: 2008-09 అర్హత కలిగిన అభ్యర్థులు తీసుకురావాల్సిన పత్రాలు: ఆధార్ కార్డు జనన తేదీ ధృవపత్రం 2 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు (అసలు మరియు జిరాక్స్ ప్రతులు తప్పనిసరి) ఈ కార్యక్రమాన్ని కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు అధ్యక్షుడు: వి. మధు చైర్మన్: శివ నాయర్ ప్రధాన కార్యదర్శి: ఎం. శేఖర్ మరిన్ని వివరాలకు: ఫోన్ నెంబర్ 9177112942 యువ బాక్సర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# ఉగాది పండుగ మన సంస్కృతికి ప్రతీక

## ముఖ్య అతిథి కాగజ్‌నగర్ డిఎస్‌పి.వహీదుద్దీన్



- కలిసి మెలిసి పండుగలను జరుపుకోవడం ద్వారా సామాజిక ఐక్యత బలపడుతుంది -ముఖ్య అతిథి కాగజ్‌నగర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్.షాహీన్ సుల్తానా

**నేటి సాక్షి కొమరం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి మార్చ్ 19 :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కమిటీ టి ఎస్ యు టి ఎఫ్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి వైద్య శాంతికుమారి. సమన్వయకర్తగా వ్యవహరించంగా ముఖ్య అతిథులుగా కాగజ్‌నగర్ డిఎస్‌పి వహీదుద్దీన్ మరియు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి వహీదుద్దీన్ మాట్లాడుతూ, అని, ఉగాది పచ్చడి జీవితం లోని షడ్రుచులను సూచిస్తుందని తెలిపారు. సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుందని అన్నారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా మాట్లాడుతూ, ప్రజలతో కలిసిమెలిసి పండుగలను జరుపుకోవడం ద్వారా సామాజిక ఐక్యత బలపడుతుందని అన్నారు. టిఎస్‌యూటిఎఫ్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం అని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కార్యక్రమ సమన్వయకర్త వైద్య శాంతికుమారి మాట్లాడుతూ, ఉగాది పండుగ సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో సేవా భావాన్ని పెంపొందించడమే టిఎస్‌యూటిఎఫ్ లక్ష్యమని, ప్రజలందరూ సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కుటుంబ సభ్యులతో పాల్గొనగా, జిల్లా కార్యదర్శి రాజ కమలాకర్ రెడ్డి.కాగజ్‌నగర్ మండల ప్రధాన కార్యదర్శి మహేష్, సిర్పూర్ టి మండల బాధ్యులు జహీర్, ఉపేందర్, మరియు మనీషా, లక్ష్మీనారాయణ, జావేద్, తస్వీర్ గార్లు, వివిధ సంఘాల నాయకులు త్రివేణి, ఆనంద్‌కుమార్, వినోద, అనిత, సుధ, షాహినా బేగం మహమునా బేగం పాల్గొన్నారు.

# బలహీనతలను అధిగమించి విజయం వైపు అడుగులు వేయాలి



- ఎస్ కె ఎన్ ఆర్ వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు

**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెల్ల బాపు) :** ఈ తెలుగు సంవత్సరాది పరాభవ నామ సంవత్సరంలో మన లోని బలహీనతలను అధిగమించి విజయం వైపు అడుగులు వేయాలని వాకర్స్ ఆకాక్షించారు.ఎస్ కె ఎన్ ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం ఎస్ కె ఎన్ ఆర్ వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు నిర్వహించారు..వక్తలు ఉగాది పండుగ విశిష్టతను వివరిస్తూ కొత్త ఆశలతో జీవించాలని, నేటి కాలంలో ఉమ్మడి కుటుంబ ఆవశ్యకతను , అన్యోనాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.. సుమారు 200 మంది పాల్గొన్న వాకర్ లు కొత్త సంవత్సరంలో ఇంకా ఆరోగ్యం వైపు అడుగులు వేస్తూ నూతన ఉత్తేజంతో జీవనం కొనసాగిస్తామని ఉద్ఘాటించారు.. అనంతరం ఉగాది పచ్చడి ఆరగించి, బూరెలు పంపిణీ చేశారు..ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరిగేల అశోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సమీండ్ల శ్రీనివాస్, వాకర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు గుండా సురేష్, సాగి శ్రీధర్ రావు, ఎర్ర నర్సయ్య, అంబారీ శ్రీనివాస్, పిల్లి శ్రీనివాస్, కౌన్సిలర్ లు రాజేష్, ధర్మరాజు, గంగాధర్, శంకర్, భూమయ్య, చల్ల లక్ష్మారెడ్డి, పురుషోత్తం రెడ్డి , బైరం హరికిరణ్, శ్రీధర్ రావు, పరంధాములు, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మండలంలో ఉగాది వేడుకలు



**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్) :** గన్నేరువరం మండల వ్యాప్తంగా గురువారం రోజున శ్రీ పరాభావ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది పురస్కరించుకొని గ్రామాల్లోని దేవాలయాలలో గన్నేరువరం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, ఖాసీంపేట శ్రీమానసా దేవి ఆలయం, మైలారం శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంతో పాటు పలు గ్రామాల్లోని దేవాలయాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణం వినిపించారు. గన్నేరువరం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో వేద పండితులు మణి శంకర్ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం సర్పంచ్ రంగనవేని లచ్చినర్సు,వార్డు సభ్యులు మచ్చ సాయి కృష్ణ, రంగనవేని సతీష్,వేదిరే విజేందర్, సందవేణి ప్రశాంత్ యాదవ్, లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ బోయిని అంజయ్య, ఉపాధ్యక్షులు మునగంటి లింగయ్య, బొడ్డు బాలయ్య, కార్యదర్శి జాలి శ్రీనివాస్ రెడ్డి, కాంతాల రాంభూపాల్ రెడ్డి, బూర తిరుపతి, యువజన నాయకులు మునిగంటి తిరుపతి, కాందాల నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటా ఆనందం, ఐశ్వర్యం నిండాలి


రేణుకుంట సర్పంచ్ ఎలుక ఆంజనేయులు..



**నేటి సాక్షి, తిమ్మాపూర్ :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రేణికుంట గ్రామంలోని తిరుమలప్ప ఆలయంలో పంచాంగ పఠనం చేశారు. పంచాంగ శ్రవణానంతరం సర్పంచ్ ఆంజనేయులు సర్పంచ్ మాట్లాడుతూ.. పరాభవా నామ నూతన్ సంవత్సరంలో ప్రతి ఇంటా ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని భగవంతుణ్ణి వేసుకున్నట్లు చెప్పారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ మనమంతా ముందుకు సాగాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. మాజీ వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, ఉపసర్పంచ్ ల్యాగల దేవేందర్ రెడ్డి, వార్డు సభ్యులు గోనెల స్వప్న-సది, కుంభం లక్ష్మి-అశోక్, బోయిని సంగీత-సతీష్, పోతుగంటి అనిల్, కొర్రి వంశీ, బావండ్ల ప్రవీణ్, బోయిని శంకరయ్య, తమ్మనవేణి స్వప్న-రాములు మాజీ ఉపసర్పంచ్ కుంభం శ్రీనివాస్, మాజీ కో ఆప్షన్ సభ్యులు భీరం మహేశ్వరీ, కనపర్తి చంద్రశేఖర్, ఆలయ చైర్మన్ రొండ్ల రాజేశ్వర్ రెడ్డి ఆలయ ప్రధాన అర్చకులు చీమిరాల రామకృష్ణమాచార్యులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు పవిత్ర మాసం రంజాన్

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద




**మంచిర్యాల జిల్లా,, మార్చి 19, నేటి సాక్షి :**ముస్లిం సోదరులకు పవిత్ర మాసమైన రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు తోఫా అందిస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని మసీదులో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు, తోఫా పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాబు రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు తోఫా అందిస్తుందని తెలిపారు. జైపూర్ మండలానికి 350 మంజూరు చేయగా ఇందారం గ్రామానికి 250 కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో పారిశుధ్యం, త్రాగునీరు, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ ఫైళ్ళ క్లియరెన్స్, ఇతర కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులకు కార్యక్రమం అమలుపై శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే విధంగా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేసి పలు రకాల వృత్తి విద్యలో శిక్షణ అందించి ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కల్పించేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఈద్ కా తోఫా కార్యక్రమంలో భాగంగా ముస్లిం సోదరులకు కానుకలు అందజేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మసీదు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ షెడ్ ను ప్రారంభించారు. అనంతరం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని ఎ జోన్ లో గల బిలాల్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి హాజరయ్యారు.

# కరీంనగర్ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు



నూతన కార్పొరేటర్లకు ఘన సన్మానం

**కరీంనగర్, మార్చి 19:** నగరంలోని పట్టణ పద్మశాలి సంఘ భవనంలో గురువారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పంచాంగ శ్రవణం, నూతనంగా ఎన్నికైన పద్మశాలి కుల బాంధవులైన కార్పొరేటర్లకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు గడ్డం శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్, ఖమ్మం ఆర్డీవో నక్క శ్రీనివాస్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ కట్ల వేణుమాధవ్, జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మామిడాల సురేందర్ (ఎస్ఐ) హాజరై ప్రసంగించారు. నగరంలోని 66 డివిజన్లలో ఆరుగురు పద్మశాలీలు కార్పొరేటర్లుగా గెలవడం గర్వకారణమని వారు కొనియాడారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, నిరంతరం ప్రజాసేవలో ఉంటూ వారి మన్ననలు పొందాలని సూచించారు. భవిష్యత్తులో మరింత మంది పద్మశాలీలు ప్రజాప్రతినిధులుగా ఎదగాలని వారు ఆకాంక్షించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన కార్పొరేటర్లు వాసాల రమేష్ (17వ డివిజన్), చొప్పరి జయశ్రీ (12వ డివిజన్), తేల లక్ష్మి రమేష్ (13వ డివిజన్), వేముల కవిత చంద్రశేఖర్ (18వ డివిజన్), మరియు మాసం గణేష్ (39వ డివిజన్)లను సంఘం తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు మెతుకు సత్యం, జిల్లా పోప సంఘం అధ్యక్షులు పోలు సత్యనారాయణ, జిల్లా యువజన సంఘం అధ్యక్షులు గుడిమల్ల శ్రీకాంత్, పోప ప్రధాన కార్యదర్శి ఎలిగేటి మల్లికార్జున్ పాల్గొన్నారు. అలాగే పట్టణ సంఘ ప్రధాన కార్యదర్శి వంగర ఆంజనేయులు, కోశాధికారి గజవెల్లి కనకయ్య, ఉపాధ్యక్షులు తెల్ల చంద్రశేఖర్, వెల్దండి కనకయ్య, ఎలిగేటి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పొరండ్ల రమేష్, ఉషకోయిల సుజాత, కార్యదర్శులు బొల్లి రవి, కస్తూరి వాసు, ఆడెపు మునిందర్, మాసం సుధాకర్, బొల్లబత్తిని రవీందర్, వెనుగంటి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లింలకు 'ఈద్ ముబారక్ తోఫా'ల పంపిణీ



**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మార్చి 19:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లింలకు అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి Revanth Reddy పంపించిన 'ఈద్ ముబారక్ తోఫా'లను ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు నూర్ నగర్ మసీదు వద్ద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు ఎం.డి. సాదిక్ అలీ, మసీదు ఇమామ్ మదన్ సాహెబ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు రంజాన్ తోఫాలను అందజేశారు.కార్యక్రమంలో నూర్ నగర్ నాయకులు జమీర్ అహ్మద్, షాహిద్ మాలిక్, షాబాజ్ హుస్సేన్, సక్లైన్ అలీ, అర్బాజ్, కమిటీ సభ్యులు మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మార్చి 19 :** ఉగాది పండుగ సందర్భంగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే శ్రీమతి కోవ లక్ష్మి తన నివాసంలో ప్రజా ప్రతినిధులు, నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు తమ తనయుడు కోవ సాయినాథ్‌తో కలిసి హాజరైన వారిని ఆత్మీయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్, కౌన్సిలర్లు చిలువేరు, వెంకన్న, నిస్సార్, సాయి శ్రావణ్, అరవింద్ లోదా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## భక్తి శ్రద్ధలతో ఉగాది సంబరాలు



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి మార్చి 19 :** శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో సంబరాలు జరుపుకున్నారు, మండల వ్యాప్తంగా గల ఆలయాలలో ఉదయం నుంచి విశేష పూజలు జరిగాయి షడ్రుచుల సమ్మేళనతో రుచులను చవిచూశారు పట్టణంలోని శ్రీ అభీష్టల మృత్యుంజయ స్వామి శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కమలాంజనేయ స్వామి అంతేకాకుండా మండలం వ్యాప్తంగా గల పలు ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు, పుదీపట్ల స్వయంభు శ్రీ వైష్ణవి మాత ఆలయంలో ఉగాదిని పురస్కరించుకొని వేద పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు ,ప్రజలు భక్తిశ్రద్ధలతో ఉగాదిని జరుపుకున్నారు

## హనుమాన్ పల్లి లో ముస్లింలకు బట్టల పంపిణీ



**నేటి సాక్షి నారాయణపేట మార్చు 20( రిపోర్టర్ ఇమామ్ సాబ్ ) :** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని హనుమన్ పల్లి గ్రామ సర్పంచ్ కె. తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ మైనార్టీలకు ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన రంజాన్ కా తోహఫా ను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ మైనార్టీ సోదరులు మరియు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఊరురా ఉగాది ఉత్సవాలు



**నేటిసాక్షి : మార్చి 19 జగదేవపూర్ :** ఉగాది పర్వదినం పండుగ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తీగుల్, మునిగడప, చాట్లపల్లి, జగదేవపూర్, తిమ్మాపూర్, అలీ రాజపేట్, వట్టిపల్లి, అంతాయిగూడ, జంగం రెడ్డిపల్లి, బస్వాపూర్, పీర్లపల్లి, ధర్మారం, ఇటిక్యాల తదితర గ్రామాల్లో ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆయా గ్రామాల పంతులు నూతన తెలుగు సంవత్సర సంబంధించిన పంచాంగాన్ని చదివి వినిపించారు. ఈసారి వర్షాలు సముద్ర సమృద్ధిగా కురిసి పంటలు పండనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**విందు ఇచ్చిన 20 వార్డు కౌన్సిలర్ శ్వేత వెంకటేష్ గౌడ్**



**నేటి సాక్షి,నారాయణపేట మార్చి 19,( రిపోర్టర్ ఇమామ్ సాబ్ ) :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని రంజాన్ సందర్భంగా గురువారం 20వ వార్డు లోని శతవాహన కాలనీలో మజీద్ లో తెలంగాణ ప్రభుత్వం మరియు వార్డు కౌన్సిలర్ శ్వేత వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫత్తర్ విందు ఇవ్వడం జరిగింది ఈ యొక్క కార్యక్రమం లో మార్కెట్ కమిటీ ఛైర్మెన్ శివ రెడ్డి డైరెక్టర్ శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ



**నేటి సాక్షి మార్చి 19 (మంచిర్యాల) శ్రీధర్ దమ్మ :** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మార్కెట్ ఏరియా లో శ్రీ పరాభవ నామ సంవత్సర తెలుగు వారి తొలి ఉగాది పండుగ సందర్భంగా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కష్టసుఖాల సమ్మేళనమే ఈ జీవితం , ఈ నూతన సంవత్సరం మీ జీవితంలో కష్టాలను కడతేర్చి , సుఖశాంతులను ప్రజలందరికీ ప్రసాదించాలని ఆ భగవంతుని ప్రార్థించారు. అందరికీ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న , అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, నాయకులు రాంరెడ్డి , పర్వతాల యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షంతో నేలకొరిగిన బీరపంట



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి మార్చి 19 :** అకాల వర్షంతో మండలంలో పలు వాణిజ్య పంటలు నేలకొరిగాయి అంతేకాకుండా పలుచోట్ల విద్యుత్ సమస్య నెలకొని ఉంది, బుధవారం రాత్రి మండల వ్యాప్తంగా పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షం పడింది దీంతో 29 చింతమాకులపల్లి పంచాయతీ ఖాన్సాబ్ మి ట్టకు చెందిన, నూరుల్లా ఎకరా స్థలంలో వేసిన వేల తోట కుప్పకూలింది, మార్కెట్లో ధర ఎక్కువ ఉండడంతో రైతు చేసిన అప్పులు తీర్చుకోవాలని బీ రపంట సాగు చేశాడు తీరా చూసి చేతికందే సమయంలో అకాల వర్షం తన కొంప ముంచిందని నూరుల్లా వాపోయాడు అదేవిధంగా చౌడేపల్లి పట్టణంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరకడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం వాటిల్లింది ,దీంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు ఒకవైపు దోమల మోత మరోవైపు కరెంటు కోతతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందని పట్టణ ప్రజలు అన్నారు, అకాల వర్షం మామిడి రైతులకు సైతం నష్టాన్ని మిగిల్చింది ఇప్పుడిప్పుడే వస్తున్న మామిడి పిందే నేలరాలాయి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు

# పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి మార్చి 19 :** పట్టణంలోని పారిశుద్ధ్య కార్మికులకు ఇస్సా లలితమ్మ నూతన వస్త్రాలను అందించింది, నూతన సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని నిత్యం కష్టపడే పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందించడం తనకు ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఇస్సా లలితమ్మ అన్నారు, ఈ కార్యక్రమంలో ఇస్సా నాగలక్ష్మి ఇస్సా రాంకుమార్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు

# రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లింలకు కిట్‌ల పంపిణీ

- **మెట్‌పల్లిలో కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో కార్యక్రమం**
- **పేదల ఇళ్లలో పండుగ వాతావరణం సృష్టించడమే లక్ష్యం**



**నేటి సాక్షి - మెట్‌పల్లి ( రాధారపు నర్సయ్య ) :** రాబోయే రంజాన్ పండుగను పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం పేద ముస్లింలకు రంజాన్ కిట్‌లను పంపిణీ చేస్తుండగా, కోరుట్ల నియోజకవర్గంలోని మెట్‌పల్లి పట్టణంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో 21వ వార్డులో పేదలకు కిట్‌లు అందజేసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

**కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో కిట్‌ల పంపిణీ**

కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు జువ్వాడి కృష్ణారావు, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ఆధ్వర్యంలో 21వ వార్డులో పేద ముస్లింలకు రంజాన్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొని కిట్‌లను స్వీకరించారు.

**పేదల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ -- జువ్వాడి కృష్ణారావు**

ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం తరపున ముస్లింలకు రంజాన్ కిట్‌ల పంపిణీ చేయడం వల్ల పేద కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదల పక్షాన నిలుస్తుందని పేర్కొంటూ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

**సేవ చేయడం సంతోషం -- మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి**

మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ, ఈ రంజాన్ సందర్భంగా పేదలకు అవసరమైన వస్తువులను అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కజీ ఇంతేజామి సెంట్రల్ కమిటీ అధ్యక్షులు అఖ్తర్ జానీ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కౌన్సిలర్లు ఖాజా అజీమ్, మాసుల ప్రవీణ్, బత్తుల నరేష్, పందిరి రమేష్, రెబ్బాస్ మహేష్, గుడికందుల అజయ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ముఖీం, మహ్మద్ ఖలీద్, నదీమ్, షేక్ మహ్మద్, రయీస్, లతీఫ్, కలిమ్ ఖాన్, మస్జిద్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ వాసే, యం.డి. అహ్మద్, మహ్మద్ వాసె (ఎన్ఆర్ఐ) తదితరులు పాల్గొన్నారు.

# పంచాంగ శ్రవణంతో ఆధ్యాత్మిక వాతావరణం



- **కోరుట్లలో ఘనంగా ఉగాది వేడుకలు**
- **శివాలయ నిర్మాణానికి రూ.1,11,111 విరాళం**

**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీ అయ్యప్ప, జ్ఞాన సరస్వతీమాత ఆలయంలో వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

**వైదిక పూజలు -- పంచాంగ శ్రవణం**

ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారి మూలవిరాట్టులకు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతన సంవత్సర ఫలితాలను తెలియజేస్తూ పంచాంగ శ్రవణం నిర్వహించగా, భక్తులు ఆసక్తిగా వినిపించారు.

**శివాలయ నిర్మాణానికి భూరి విరాళం**

ద్వాదశ జ్యోతిర్లింగ సహిత శివాలయ నిర్మాణానికి స్థానిక వాస్తవ్యులు స్వర్గీయ డా॥ అందె వేంకటరాజం--నరసమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయులు అందె శివప్రసాద్--మాధవి దంపతులు రూ.1,11,111 విరాళాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను ఘనంగా సత్కరించారు.

**భక్తుల సహకారం కోరిన ఆలయ కమిటీ**

ఆలయ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ గురుస్వామి మాట్లాడుతూ..సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న శివాలయానికి భక్తులు ధన, వస్తురూపేణ సహకరించి ఆ పరమేశ్వరుని కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షులు చిదురాల నారాయణ గురుస్వామి, ప్రధాన కార్యదర్శి తోట రాజు, కోశాధికారి జుంబర్తి రమేష్, శ్రీరాముల శ్రీనివాస్, కాసు క్రాంతి, చలిగంటి వినోద్, ఆడెపు శంకర్, గాజంగి లక్ష్మిపతి, రాచమడుగు శ్రీనివాస్ రావు, కల్లూరి సాయి, మరిపెల్లి శంకర్ గౌడ్, పిన్నంశెట్టి రాము తదితరులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం-ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

- **కథలాపూర్ మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**
- **మహిళా సంఘాల భవనాలకు రూ.30 లక్షల నిధులతో పనులు ప్రారంభం**



**నేటి సాక్షి - కథలాపూర్ ( రాధారపు నర్సయ్య ) :** కథలాపూర్ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొంటూ మహిళా సమైక్య సంఘాల భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

**మహిళల బలోపేతమే అభివృద్ధి పునాది**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, మహిళల సాధికారత ద్వారానే సమాజం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక స్థితిని మెరుగుపరచేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మహిళా సమైక్య సంఘాలను బలోపేతం చేయడం ద్వారా కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని తెలిపారు.

**మహిళా సంఘాల భవనాలకు శంకుస్థాపన**

కథలాపూర్ మండలంలోని పోసానిపేట, చింతకుంట గ్రామాల్లో రూ.30 లక్షల నిధులతో నిర్మిస్తున్న మూడు మహిళా సమైక్య సంఘాల నూతన భవనాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ భవనాలు మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడటంతో పాటు గ్రామీణ మహిళల ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

**గ్రామపంచాయతీ భవన ప్రారంభం**

అనంతరం రాజారాం తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

**పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో..**

పెగ్గెర్ల గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవం, తుర్తి గ్రామంలోని పాత హనుమాన్ జాతర మహోత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను గౌరవించడం కూడా ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుంద్ర నారాయణ, మండలాధ్యక్షులు కాయితీ నాగరాజు, బ్లాక్ అధ్యక్షులు ఎం.డి. అజీమ్, తహశీల్దార్ గుగ్గిళ్ల రమేష్, ఆర్ఐ రవీందర్, చెదలు సత్యనారాయణ, పులి హరిప్రసాద్, సర్పంచ్ తిరుపతి, న్యావనంది శేఖర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **ఇఫ్తార్ విందు--తోఫాల పంపిణీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**నేటి సాక్షి, ఎండపల్లి:** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు--తోఫాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. మండలంలోని రాజారాంపల్లి ఎస్.ఆర్. గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణలో పాల్గొని నమాజ్ పాటించడం విశేషంగా నిలిచింది. ఎండపల్లి, వెల్గటూర్, ధర్మారం, గొల్లపల్లి, పెగడపల్లి మండలాలకు చెందిన ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తోఫాల పంపిణీ అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పేద ముస్లిం మైనార్టీలకు ప్రతి సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించడంలో ఇఫ్తార్ విందులు ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలోని అన్ని ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించిన మంత్రి, మజీద్‌లు, ఈద్గా, ఖబ్రస్థాన్‌ల అభివృద్ధికి రూ.51 లక్షలు కేటాయించినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ముస్లిం సోదరులకు మంత్రి ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాజా గౌడ్, ఆర్డీవో మధుసూధన్, తహశీల్దార్లు ఎడ్ల అనిల్ కుమార్, ఆర్.శేఖర్, ఎంపీడీవోలు దొండ కృపాకర్, నరేష్ కుమార్, గిర్ధవర్ అన్వేష్, ఏఎంసీ చైర్మన్ గుండాటి గోపిక, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్, సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి, మహ్మద్ బషీర్, స్థానిక సర్పంచ్ సంగ రమేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ముస్లిం మత పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన
# గౌతమ్ గంభీర్

**ఢిల్లీ:** ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్.. తన వ్యక్తిత్వాన్ని దుర్వినియోగం చేస్తున్న ఏఐ డీప్‌ఫేక్‌లు, నకిలీ వీడియోలు మరియు అనధికారిక వస్తువుల విక్రయాలపై కఠిన చర్యలు కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశారు.. గంభీర్ తన పిటిషన్‌లో, తన పేరు, ముఖం, గొంతును అనుమతి లేకుండా ఉపయోగిస్తూ సోషల్ మీడియాలో నకిలీ కంటెంట్ విస్తృతంగా వ్యాపిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ వంటి వేదికలపై ఏఐ టెక్నాలజీ, ఫేస్ స్వాప్, వాయిస్ క్లోనింగ్ ద్వారా తాను చెప్పని మాటలు చెప్పినట్లు చూపించే వీడియోలు తయారు చేస్తున్నారని తెలిపారు. 2025 చివరి నుండి ఈ నకిలీ కంటెంట్ భారీగా పెరిగిందని గంభీర్ న్యాయవాదులు కోర్టుకు వివరించారు. కొన్ని వీడియోలు లక్షల సంఖ్యలో వీక్షణలు సాధించడంతో ప్రజల్లో అపోహలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాతో పాటు ఈ–కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో కూడా గంభీర్ పేరు, ఫోటోలను ఉపయోగించి అనుమతి లేకుండా పోస్టర్లు మరియు ఇతర ఉత్పత్తులు విక్రయిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌వంటి ఈ–కామర్స్ సంస్థలు, అలాగే మెటా ప్లాట్‌ఫామ్స్, గూగుల్, యూట్యూబ్, ఎక్స్ వంటి టెక్ కంపెనీలను ప్రతివాదులుగా చేర్చారు. తన పిటిషన్‌లో గంభీర్ మొత్తం 16 మంది ప్రతివాదులపై కేసు వేస్తూ, తన వ్యక్తిత్వ హక్కులను రక్షించాలంటూ కోర్టును కోరారు. ఈ సందర్భంగా ఆయన రూ. 2.5 కోట్ల నష్టపరిహారం కోరడమే కాకుండా, నకిలీ కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని, భవిష్యత్తులో తన పేరు, ముఖం, గొంతును అనుమతి లేకుండా ఉపయోగించకుండా నిషేధించాలని అభ్యర్థించారు. ఈ కేసులో గంభీర్ కాపీరైట్ చట్టం 1957, ట్రేడ్‌మార్క్ చట్టం 1999 మరియు వాణిజ్య న్యాయస్థానాల చట్టాన్ని ప్రస్తావించారు. అలాగే అమితాబచ్చన్, అనిల్‌కపూర్‌కేసుల్లో వచ్చిన పర్సనాలిటీ రైట్స్‌కు సంబంధించిన తీర్పులను కూడా ఉదాహరణగా చూపించారు. నా గుర్తింపును ఒక ఆయుధంగా వాడుకున్నారు. నా పేరు, ముఖం, గొంతు దుర్వినియోగం చేయబడ్డాయి. ఇది కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, చట్టం మరియు గౌరవానికి సంబంధించిన విషయం అని గౌతమ్ గంభీర్ పేర్కొన్నారు. అయితే, ఈ కేసుపై ఢిల్లీ హైకోర్టు మార్చి 20న విచారణ చేపట్టనుంది. ఈ విచారణలో వచ్చే తీర్పు భవిష్యత్తులో ఏఐ డీప్‌ఫేక్‌ల నియంత్రణ మరియు వ్యక్తిత్వ హక్కుల రక్షణకు మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉంది.

# నా పదవీకాలం పొడిగించండి

### బీసీసీఐని కోరిన అజిత్ అగార్కర్!

**ముంబై:** టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తన పదవీకాలాన్ని పొడిగించాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)ను కోరినట్లు సమాచారం. పదవీకాలాన్ని 2027 వన్డే వరల్డ్ కప్ వరకు పొడిగించాలని కోరినట్లుగా వార్తలు వస్తున్నాయి. టీ20 వరల్డ్ కప్ 2026ను భారత్ గెలిచిన వెంటనే అగార్కర్ ఈ మేరకు బీసీసీఐని అభ్యర్థించినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై బీసీసీఐలో చర్చలు జరుగుతున్నాయట. అయితే ఇప్పటివరకు ఈ విషయంపై బీసీసీఐ, అగార్కర్ కానీ అధికారికంగా ధ్రువీకరించలేదు. ఇప్పటికే ఐపీఎల్ 2025కు ముందు అజిత్ అగార్కర్ కాంట్రాక్ట్‌ను మరో ఏడాది పాటు బీసీసీఐ పొడిగించింది. భారత్ 2024 టీ20 వరల్డ్ కప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడంలో అతని పాత్రను గుర్తిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. తాజాగా టీ20 వరల్డ్ కప్ 2026 విజయం అనంతరం అగార్కర్ తన అభ్యర్థనను బీసీసీఐ ముందుంచాడట. 2020–21లో చీఫ్ సెలెక్టర్ పదవి ఖాళీ అయినప్పుడు అగార్కర్ కూడా దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. ఆ అవకాశం చెతన్ శర్మకు దక్కింది. 2023 మధ్యలో అగార్కర్ బాధ్యతలు చేపట్టాడు. అప్పటి నుంచి సెలెక్షన్ ప్రక్రియ ఆయనకు పెద్ద సవాల్‌గా మారింది. అజిత్ అగార్కర్ పదవీకాలంలో భారత జట్టు నాలుగు ఐసీసీ ఫైనల్స్ ఆడింది. 2023 వన్డే వరల్డ్ కప్, 2024 టీ20 వరల్డ్ కప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2026 టీ20 వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత్ ఆడింది. వీటిలో మూడు టైటిళ్లు గెలుచుకోవడం విశేషం. అగార్కర్ తీసుకున్న కొన్ని కీలక నిర్ణయాలు క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీశాయి. ముఖ్యంగా హార్దిక్ పాండ్యా స్థానంలో సూర్యకుమార్ యాదవ్‌ను టీ20 కెప్టెన్‌గా మద్దతు ఇవ్వడం, అలాగే రోహిత్ శర్మను వన్డే కెప్టెన్సీ నుంచి తప్పించడం వంటి నిర్ణయాలు ధైర్యసాహసాలతో కూడినవిగా చెప్పాలి. ఈ నిర్ణయాలపై విమర్శలు వచ్చినప్పటికీ.. అగార్కర్ వాటిని సమర్థంగా ఎదుర్కొన్నారు. జట్టు ఎంపిక అనేది కేవలం గణాంకాలపై ఆధారపడే ప్రక్రియ కాదు. ఆటగాళ్ల సామర్థ్యం, జట్టులో వారి పాత్ర, వ్యూహాత్మక ఆలోచనలన్నీ కలిసి నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. ఈ విషయంలో అగార్కర్, అతని సెలెక్షన్ కమిటీ సక్సెస్ అయినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా చూస్తే.. అగార్కర్ నాయకత్వంలో భారత క్రికెట్ జట్టు వైట్ బాల్ ఫార్మాట్‌లో మంచి ఫలితాలు సాధించింది. ఈ నేపథ్యంలో ఆయన పదవీకాలాన్ని 2027 వరల్డ్ కప్ వరకు పొడిగిస్తారా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# అసలైన ఐపీఎల్ దిగ్గజాలు

- 2008 నుంచి 18 ఏళ్లుగా సంచలనం సృష్టిస్తున్న 7 మంది సూపర్‌స్టార్లు!




**ఢిల్లీ:** 2026 ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రారంభానికి రోజులే మిగిలి ఉన్నాయి. తొలి మ్యాచ్ మార్చి 28న బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో జరగనుంది. పలు రాష్ట్రాల్లో ఎన్నికల కారణంగా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఇప్పుడే 20 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను విడుదల చేసింది. అయితే.. ఐపీఎల్ అసలైన దిగ్గజాలు.. 18 ఏళ్లుగా సంచలనం సృష్టిస్తున్న 7 మంది సూపర్‌స్టార్లు గురించి ఇప్పుడు చూద్దాం.. ముందుగా ఐపీఎల్‌లో అందరి కళ్లు ధోనీపైనే ఉన్నాయి. 44 ఏళ్ల వయసులోనూ మైదానంలో మెరుపులు మెరిపించేందుకు మహేంద్ర సింగ్ ధోనీ సిద్ధమవుతున్నాడు. 2008లో ఐపీఎల్ ప్రయాణం మొదలుపెట్టిన ధోనీ, ఇప్పటికీ అదే ఉత్సాహంతో బరిలోకి దిగుతున్నాడు. ధోనీ ఒక్కడే కాదు.. లీగ్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు పట్టు వదలని విక్రమార్కుడిలా మరో ఆరుగురు ప్లేయర్స్ దుమ్ము రేపుతున్నారు. వారు ఎవరో కాదు.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, మనీష్ పాండే ఏటా ఐపీఎల్ సీజన్‌లో భాగస్వామ్యం వహించగా.. అజింక్యా రహానే, ఇషాంత్ శర్మ, రవీంద్ర జడేజా మాత్రం వివిధ కారణాల వల్ల మధ్యలో కొన్ని సీజన్లకు దూరమయ్యారు.

### విరాట్ కోహ్లీ:

ఐపీఎల్‌లో విరాట్ కోహ్లీకి ప్రత్యేకత ఉంది. సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు అంటే ఈ 18 ఏళ్లలో ఆర్సీబీ తరఫునే ఆడుతుండటం విశేషం. ఎప్పటి నుంచో కప్పు కొట్టాలని ఉర్రూతలుగిన విరాట్‌కు గతేడాది విజయం వరించింది. 2025లో ఆర్సీబీ కప్పు కొట్టింది. అంతేకాదు.. మొత్తం అన్ని ఐపీఎల్ సీజన్లలో కలిసి ఇప్పటి వరకు 267 మ్యాచులు ఆడిన విరాట్ 8,661 పరుగులతో ఐపీఎల్ చరిత్రలోన టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

### ఎంఎస్ ధోనీ

ఇక ధోనీ జర్నీ చూస్తే.. ముందు నుంచి ధోనీ చెన్నై తరఫునే ఉన్నాడు.. కానీ 2016–17లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)పై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఈ సీజన్‌లో మాత్రం రైజింగ్ పూణే సూపర్‌జెయింట్స్ తరఫున ఆడాడు. ఆ రెండేళ్లు మినహా ధోనీ ప్రస్థానమంతా సీఎస్‌కేతోనే ముడిపడి ఉంది. తన సారథ్యంలో ఐదుసార్లు జట్టును విజేతగా నిలిపిన ధోనీ, 278 మ్యాచ్‌ల్లో 5,439 పరుగులు సాధించడమే కాకుండా కీపర్‌గా 158 క్యాచ్‌లు, 47 స్టంపింగ్స్‌తో రికార్డు సృష్టించాడు. ఈసారి జట్టులో సంజూ శామ్సన్ కూడా వికెట్ కీపర్‌గా ఉండటంతో ధోనీ పాత్ర ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

### హిట్ మ్యాన్

భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 2008 నుంచి తన ఐపీఎల్ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నాడు. మొదట్లో డెక్కన్ ఛార్జర్స్ తరఫున ఆడిన రోహిత్ ఆ తర్వాత ముంబై ఇండియన్స్‌కు ఐదు ట్రోఫీలు అందించాడు. ఐపీఎల్ చరిత్రలో విజయవంతమైన కెప్టెన్‌గా రోహిత్ నిలిచాడు. 272 మ్యాచ్‌ల్లో 7,046 పరుగులు చేసిన రోహిత్, ఈసారి కూడా కేవలం ఆటగాడిగానే తన పవర్‌ను చూపించనున్నాడు.

ఇక ఐపీఎల్ చరిత్రలో సెంచరీ సాధించిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించిన మనీష్ పాండే, ఈసారి కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తరఫున బరిలోకి దిగుతున్నాడు. ఇప్పటివరకు 7 వేర్వేరు జట్ల తరఫున ఆడిన అనుభవం మనీష్ సొంతం. ఇక స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా తన పాత గూడైన రాజస్థాన్ రాయల్స్‌లోకి తిరిగి చేరాడు. 2010లో నిబంధనల ఉల్లంఘన కారణంగా ఒక సీజన్ నిషేధానికి గురైనప్పటికీ, 254 మ్యాచ్‌ల్లో 3,260 పరుగులు, 170 వికెట్లతో జడ్డూ అత్యుత్తమ ఆల్ రౌండర్‌గా కొనసాగుతున్నాడు. అజింక్యా రహానే విషయానికొస్తే, ఈసారి కేకేఆర్ జట్టును కెప్టెన్‌గా నడిపించే బాధ్యతను అందుకున్నాడు. 198 మ్యాచ్‌ల అనుభవమున్న రహానే, 2010లో ఆడే అవకాశం రాకపోయినా, పట్టుదలతో తన కెరీర్‌ను 5,000 పరుగుల మైలురాయి దాటించాడు. సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మ ఈ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున తన స్పెల్స్‌తో ప్రత్యర్థులను కట్టడి చేసేందుకు సిద్ధమయ్యాడు. 2012లో గాయం వల్ల, 2018లో వేలంలో ఎవరూ కొనకపోవడం వల్ల ఆయన కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఇలా 2008 నుంచి ఇప్పటి వరకు వరుసగా మ్యాచులు ఆడుతూ వస్తున్న దిగ్గజాలు ఈ సీజన్‌లో ఎలా అడతారు? అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

# ఢిల్లీ క్యాపిటల్స్ గూటికి 'ఐరిష్' పవర్




- ఫీల్డింగ్ కోచ్‌గా జాన్ మూనీ నియామకం!

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 19వ సీజన్ ఆరంభానికి కౌంట్‌డౌన్ మొదలైన వేళ.. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ కీలక నిర్ణయం తీసుకుంది. జట్టు ఫీల్డింగ్ నైపుణ్యాలను మెరుగుపరిచే బాధ్యతను ఐర్లాండ్ దిగ్గజ ఆల్‌రౌండర్ జాన్ మూనీకి అప్పగించింది. ఈ మేరకు గురువారం ఢిల్లీ యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. "మా డిఫెన్స్‌కు ఐరిష్ స్టీల్‌ను జత చేస్తున్నాం.. జాన్ మూనీకి స్వాగతం" అంటూ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసింది.

### అపారమైన కోచింగ్ అనుభవం


44 ఏళ్ల జాన్ మూనీకి అంతర్జాతీయ స్థాయిలో కోచ్‌గా సుదీర్ఘ అనుభవముంది. 2015లో క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు నుంచి లెవల్–3 వరకు కోచింగ్ కోర్సులు పూర్తి చేశారు. గతంలో అఫ్గానిస్థాన్, వెస్టిండీస్ జట్లకు ఫీల్డింగ్ కోచ్‌గా పని చేయడమే కాకుండా, ఐర్లాండ్ మహిళల జట్టుకు కూడా సేవలందించారు. గత సీజన్‌లో కోచ్‌లుగా ఉన్న ఆంటోన్ రౌక్స్, జ్ఞానేశ్వర రావుల స్థానంలో ఇప్పుడు మూనీ బాధ్యతలు చేపట్టనున్నారు.

### కొత్త కోచింగ్ బృందంతో బరిలోకి..

గత సీజన్‌లో ఐదో స్థానంతో సరిపెట్టుకున్న ఢిల్లీ, ఈసారి ఎలాగైనా టైటిల్ గెలవాలనే పట్టుదలతో ఉంది. హెడ్ కోచ్ హేమంగ్ బదాని నేతృత్వంలో బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్, అసిస్టెంట్ కోచ్‌లు ఇయాన్ బెల్, వేణుగోపాల్ రావులతో కూడిన పటిష్టమైన కోచింగ్ బృందంతో జాన్ మూనీ కలిసి పని చేయనున్నారు. ఐపీఎల్ పండుగ ప్రారంభానికి మరో తొమ్మిది రోజులే సమయం ఉండటంతో, ఇప్పటికే నెట్స్‌లో చెమటోడుస్తున్న ఆటగాళ్లకు మూనీ రాక కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అప్పుడు భువనేశ్వర్.. ఇప్పుడు ఇషాన్..
# ఈసారి కెప్టెన్లంతా మనోళ్లే!

**న్యూఢిల్లీ:** భారత గడ్డపై పుట్టిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ సీజన్‌కు మరింతగా అలరిస్తోంది. ఆటగాళ్ల మెరుపులు, రికార్డుల మోతలే కాదు కెప్టెన్ల ఎంపికతోనూ ఐపీఎల్ సరికొత్తగా సాగుతోంది. వేసవి వినోదాన్ని పంచేందుకు మరో తొమ్మిది రోజుల్లో 19వ సీజన్ ఐపీఎల్ షురూ కానుంది. ఈసారి ప్రత్యేకత ఏంటో తెలుసా.. వరల్డ్‌కప్ హీరో ఇషాన్ కిషన్ మాజీ ఛాంపియన్ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు తాత్కాలిక సారథిగా ఎంపికవ్వడం. అంతేకాదు.. పదికి పది జట్లకు భారత ఆటగాళ్లే కెప్టెన్సీ వహించనుండడం మరో విశేషం. ఐపీఎల్ చరిత్రలో ఇలా మనోళ్లే అందరూ సారథులుగా ఉండడం ఇది రెండోసారి మాత్రమే. ఐపీఎల్ షెడ్యూల్ ప్రకటనతో ఫ్రాంచైజీలన్నీ జోరు పెంచాయి. కోచింగ్ నియామకాలను పూర్తి చేసిన జట్లు.. కెప్టెన్ ఎంపిక, ఆటగాళ్ల కసరత్తు వంటి విషయాల మీద దృష్టి సారించాయి. ఈ క్రమంలోనే పంతొమ్మిదో సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ యువకెరటం ఇషాన్ కిషన్‌ను తాత్కాలిక సారథిగా ఎంపిక చేసింది. రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఆరంభ మ్యాచ్‌లకు అందుబాటులో లేకపోవడంతో.. అతడు వచ్చేంత వరకూ ఇషాన్‌కు పగ్గాలు అప్పగించింది. దాంతో, ఈసారి ఐపీఎల్‌లో పది జట్లకు కెప్టెన్లుగా భారతీయులే వ్యవహరించనున్నారు. ఈ మెగా టోర్నీ చరిత్రలో అందరూ భారత ఆటగాళ్లే జట్టును నడిపించడం ఇది రెండోసారి. 2019లో తొలిసారి పది జట్లకు భారత క్రికెటర్లే సారథిగా ఉన్నారు. అప్పుడు కూడా సన్‌రైజర్స్ సారథి కేన్ విలియమ్సన్ అందుబాటులో లేకపోవడంతో భువనేశ్వర్ కుమార్ తాత్కాలికంగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు ఆరెంజ్ ఆర్మీకి ఇషాన్ కెప్టెన్సవడంతో ఇండియన్ స్కిప్పర్స్ సంఖ్య పదికి చేరింది.





## హీరోయిన్లనే ఎందుకు టార్గెట్ చేస్తారు?

### అనుష్క పెళ్లి వార్తలపై టీమ్ ఫైర్..

టాలీవుడ్ 'జేజమ్మ' అనుష్క శెట్టి వివాహంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలకు ఆమె టీమ్ గట్టి కౌంటర్ ఇచ్చింది. అనుష్క త్వరలో ఒక వ్యాపారవేత్తను పెళ్లాడబోతున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేస్తూనే, వ్యక్తిగత జీవితాన్ని సెన్సేషనలైజ్ చేయడంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. అనుష్క వ్యక్తిగత విషయాలను ప్రతిరోజూ హెడ్‌లైన్స్‌లోకి తీసుకురావడం సరైన పద్ధతి కాదని ఆమె ప్రతినిధులు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రతి పోస్ట్‌లోనూ ఆమె వయసును (44) హైలైట్ చేస్తూ వివాదాస్పదంగా మార్చడాన్ని తప్పుబట్టారు. "అగ్ర హీరోల వయసు విషయంలో చూపని ఉత్సాహం, కేవలం హీరోయిన్ల విషయంలోనే ఎందుకు కనిపిస్తోంది? అనధికారిక సమాచారాన్ని పదే పదే ప్రచురించడం అన్యాయం" అని టీమ్ ప్రశ్నించింది. అనుష్క తన సుదీర్ఘ కెరీర్‌ను కేవలం సొంత ప్రతిభతో, ఎంతో హుందాగా నిర్మించుకున్నారని.. ఆమె ఎప్పుడూ పీఆర్ స్టంట్స్‌పై ఆధారపడలేదని ఈ ప్రకటనలో గుర్తు చేశారు. తన వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచుకోవాలని కోరుకునే వ్యక్తిని ఇలా టార్గెట్ చేయడం సమంజసం కాదని హితవు పలికారు. "వివాహం అనేది పూర్తిగా వ్యక్తిగత విషయం. అది కేవలం వ్యూస్ కోసం వాడాల్సిన అంశం కాదు. ఇకనైనా బాధ్యతగా వ్యవహరించి, వార్తను ప్రచురించే ముందు నిజాన్ని నిర్ధారించుకోండి. హీరోయిన్లను కూడా హీరోలతో సమానంగా, గౌరవంగా చూడటం నేర్చుకోండి" అని అనుష్క టీమ్ సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేసింది. ఈ ఘాటు స్పందనతోనైనా అనుష్క పెళ్లి పుకార్లకు చెక్ పడుతుందో లేదో చూడాలి.



## 1300 మందిని కాదని..

ప్రస్తుతం సినీ ప్రపంచంలో ఎక్కడ చూసినా ఒకే పేరు మారుమోగుతోంది.. అదే సారా అర్జున్. బాలనటిగా అందరినీ అలరించిన ఈ చిన్నది, ఇప్పుడు 'ధురంధర్' సిరీస్‌తో వెండితెరపై సంచలనం సృష్టిస్తోంది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్ 2'లో 'యెలినా' పాత్రతో సారా తన నటనా విశ్వరూపాన్ని ప్రదర్శించి, టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచింది. ఈ సినిమాలో హీరో రణ్‌వీర్ సింగ్ (40), సారా అర్జున్ (20) మధ్య ఉన్న 20 ఏళ్ల వయసు వ్యత్యాసంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ నడిచింది. అయితే, తెరపై వీరిద్దరి కెమిస్ట్రీ మరియు సారా పరిణతి చెందిన నటన చూశాక విమర్శకుల నోళ్లు మూతపడ్డాయి. ఈ కీలక పాత్ర కోసం కాస్టింగ్ డైరెక్టర్ ముఖేష్ ఛబ్రా దాదాపు 1,300 మందిని ఆడిషన్ చేయగా, అందరినీ కాదని సారా తన ప్రతిభతో ఈ మెగా ఛాన్స్‌ను దక్కించుకోవడం విశేషం.





## ముగ్గురు భామలు.. వణికించే సీన్లు

వేసవి వినోదానికి తోడు ఉగాది, రంజాన్ సెలవులు కలిసి రావడంతో థియేటర్లతో పాటు ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లు కూడా కొత్త సినిమాలతో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే వెండితెరపై 'ఉస్తాద్ భగత్ సింగ్', 'ధురంధర్ 2' వంటి భారీ చిత్రాలు సందడి చేస్తుండగా, ఇప్పుడు ఓటీటీ ప్రియులను అలరించేందుకు ఒక ఆసక్తికరమైన హారర్ మూవీ సిద్ధమైంది. ఇటీవలే థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను భయపెట్టిన ఈ చిత్రం, సరిగ్గా నెల రోజుల్లోనే డిజిటల్ స్క్రీన్‌పైకి వస్తోంది. ఈ సినిమా కథాంశం విషయానికొస్తే.. సస్పెన్షన్‌కు గురైన పోలీస్ ఆఫీసర్ ఈశ్వర్ (శివ కంఠంనేని), తన భార్య భానుమతి (ధన్య బాలకృష్ణ), మరదలు భార్గవి (సుప్రీత)లతో కలిసి ప్రశాంతంగా జీవిస్తుంటాడు. అయితే, సోషల్ మీడియాలో ఫేమస్ అవ్వాలనే పిచ్చితో భార్గవి చేసిన ఒక దెయ్యం వీడియో వైరల్ అవుతుంది. ఈ క్రమంలో ఒక అజ్ఞాత వ్యక్తి విసిరిన సవాల్‌ను స్వీకరించి, నిజంగా దెయ్యాలు ఉన్నాయని నిరూపించడానికి ఈ కుటుంబం 'అమరావతి' అనే ఊరికి వెళ్తుంది. అక్కడ ఆ కుటుంబానికి ఎదురైన భయంకరమైన పారానార్మల్ అనుభవాలు ఏంటి? ఆ ఊరి జమీందారు వారసురాలు రాజేశ్వరి (ఎస్తేర్ నోరోన్హా) వెనుక ఉన్న రహస్యం ఏమిటి? ఈశ్వర్ సస్పెన్షన్‌కు, ఆ ఊరికి ఉన్న సంబంధం ఏంటి? అనే ఉత్కంఠభరితమైన ట్విస్టులతో ఈ సినిమా సాగుతుంది. ముగ్గురు కథానాయికల పెర్ఫార్మెన్స్, వెన్నులో వణుకు పుట్టించే హారర్ సీన్లతో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 20న (శుక్రవారం) ప్రముఖ ఓటీటీ సంస్థ 'ఆహా'లో విడుదల కానుంది. థియేటర్లో మిస్ అయిన హారర్ ఫ్యాన్స్, రేపటి నుంచి ఈ చిత్రాన్ని తమ మొబైల్స్ లేదా టీవీల్లో వీక్షించవచ్చు.



## శ్రీలీలను 'చెల్లెమ్మా' అని పిలిచిన అభిమాని..

టాలీవుడ్ సెన్సేషన్, యంగ్ బ్యూటీ శ్రీలీలకు అభిమానుల్లో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రస్తుతం తెలుగు, హిందీ, తమిళ భాషల్లో వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ, నేడు విడుదలైన పవర్ స్టార్ పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. ఈ క్రమంలోనే ఖమ్మం జిల్లాలో ఒక షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి హాజరైన శ్రీలీలకు ఒక వింత అనుభవం ఎదురైంది. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి శ్రీలీల వస్తున్నారని తెలుసుకున్న అభిమానులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. తన అభిమాన నటితో సెల్ఫీలు దిగేందుకు, ఆటోగ్రాఫ్‌లు తీసుకునేందుకు పోటీ పడ్డారు. శ్రీలీల కూడా ఎంతో ఓపికగా అందరికీ హాయ్ చెబుతూ ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు. అయితే, ఆ సమయంలో ఆటోగ్రాఫ్ తీసుకున్న ఒక యువ అభిమాని ఆనందంతో ఊగిపోతూ.. 'రేయ్.. చెల్లెమ్మ ఆటోగ్రాఫ్ ఇచ్చిందిరా!' అని గట్టిగా అరిచాడు. సాధారణంగా గ్లామర్ ఫీల్డ్‌లో ఉన్న హీరోయిన్లను అభిమానులు క్రష్ లేదా డ్రీమ్ గర్ల్ అని పిలుస్తుంటారు. కానీ, తనను 'చెల్లి' అని పిలవడంతో శ్రీలీల ఒక్క క్షణం అవాక్కయ్యారు. అయితే వెంటనే తేరుకున్న ఆమె, తనదైన శైలిలో హిలేరియస్ రిప్లై ఇచ్చారు. "సరే.. మరి వచ్చే రాఖీ పండుగకు నాకు మంచి గిఫ్ట్ ఇవ్వాలి" అంటూ నవ్వుతూ బదులిచ్చారు. శ్రీలీల స్పందించిన తీరుకు అక్కడున్న వారంతా ఫిదా అయిపోయారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. "అంత అందమైన హీరోయిన్‌ను చెల్లెమ్మ అని పిలిచాడంటే.. ఆ అభిమాని గుండె గట్టిదిరా!" అంటూ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. మరికొందరు శ్రీలీల సమయస్ఫూర్తిని, హుందాతనాన్ని మెచ్చుకుంటున్నారు.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# మా 'వైష్ణవి'కి న్యాయం చేస్తారా?

# మాకు అప్పగిస్తారా!?

- కోరుట్లలో రహదారిపై 'రణరంగం'
- యూట్యూబర్ 'వైష్ణవి హత్య కేసు'లో ఉరితీయాలన్న డిమాండ్
- రాస్తారోకోతో స్థంభించిన ట్రాఫిక్..
- పోలీసులతో.. కుటుంబ సభ్యుల ఘర్షణ



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** 'యూట్యూబర్ గంధం వైష్ణవి' (20) హత్య కేసు కోరుట్ల పట్టణాన్ని కుదిపేసింది.! 'నిందితులను ఉరితీయాలి.. లేదంటే మాకు అప్పగించండి..ఆ శిక్షేదో మేమే శిక్షిస్తాం..' అంటూ కన్నీటి కళ్లతో, ఆవేదనతో వైష్ణవి కుటుంబ సభ్యులు రోడ్డెక్కారు. గురువారం కొత్త బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టి, కలప దుంగలకు నిప్పంటించి రహదారిని దిగ్బంధించడంతో పట్టణం ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు..!"

### ఆవేదన.. ఆగ్రహంగా మారిన వేళ.!

'మా వైష్ణవిని చంపిన వారిని శిక్షిస్తారా..? లేక మాకు అప్పగిస్తారా..? అంటూ కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపించారు. ఫ్లెక్సీలు చేతబట్టి 'ఉరే సరైన శిక్ష' అంటూ నినాదాలు చేస్తూ ఆవేదనను ఆగ్రహంగా మార్చుకున్నారు. ఏడుస్తూనే న్యాయం కోసం పోరాడుతున్న వారి దృశ్యాలు అక్కడి వారిని కదిలించాయి.

### రహదారిపై రణరంగం-స్థంభించిన ట్రాఫిక్

కోరుట్ల కొత్త బస్టాండ్ వద్ద.. కుటుంబ సభ్యులు.. ఆందోళనకారులు కలప దుంగలను రహదారిపై పేర్చుకుని వాటికి నిప్పంటించారు. జాతీయ రహదారి పూర్తిగా దిగ్బంధించబడడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. సుమారు గంటకుపైగా రాకపోకలు స్తంభించి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారి మధ్యలోనే ఆవేదన, ఆగ్రహం కలగలిసి ఆ ప్రాంతమంతా రణరంగాన్ని తలపించింది.

### పోలీసులపై కుటుంబ సభ్యుల ఆగ్రహావేశం

హంతకుడు హరిబాబు పట్ల పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని కుటుంబ సభ్యులు మండిపడ్డారు. 'హరిబాబు మాత్రమే కాదు.. అతని కుటుంబ సభ్యులందరినీ అరెస్ట్ చేయాలి'అంటూ గట్టిగా డిమాండ్ చేశారు. 'మీ వల్ల కాకపోతే మాకు అప్పగించండి.. మేమే తగిన శిక్ష విధిస్తాం' అంటూ పోలీసులపై తీవ్రంగా విరుచుకుపడ్డారు.!





### అధికారులతో వాగ్వాదం.. తీవ్ర ఉద్రిక్తత

సమాచారం అందుకున్న కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్ఐ చిరంజీవి ఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేయాలని ప్రయత్నించారు. అయితే ఆవేదనతో ఉన్న కుటుంబ సభ్యులు వారితో ఆగ్రహావేశాలతో తీవ్ర స్థాయిలో వాగ్వాదానికి దిగారు. కొంతసేపు పరిస్థితి అదుపు తప్పేలా మారింది. 'మాకు న్యాయం కావాలి.. మాటలు వద్దు' అంటూ వారు పోలీసులను నిలదీశారు.

### హామీలతో శాంతించిన ఆందోళన.!

ఈ సందర్భంగా పోలీసులు నిందితుడు హరిబాబు కుటుంబ సభ్యులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, కేసులో కఠిన శిక్ష పడేలా పక్కా సాక్షాలు సేకరిస్తున్నామని హామీ ఇచ్చారు. ఆ హామీలతో కొంతమేరకు ఆగ్రహం చల్లారడంతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. గంటపాటు నిలిచిపోయిన ట్రాఫిక్ మళ్లీ ప్రారంభమైంది.



### కోరుట్లలో ఉద్రిక్త వాతావరణం.!

ఈ ఘటనతో కోరుట్ల పట్టణం గురువారం కొంతసేపు ఉద్రిక్తంగా మారింది. వైష్ణవి హత్య కేసు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమవుతూ, నిందితులకు కఠిన శిక్ష విధించాలన్న డిమాండ్ రోజురోజుకూ బలపడుతోంది. 'మా అమ్మాయికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు..' అన్న కుటుంబ సభ్యుల మాటలు అక్కడి వాతావరణాన్ని మరింత భారంగా మార్చాయి. ఈ ఘటన కోరుట్ల పట్టణంలో సర్వత్రా చర్చనీయాంశమైంది.

# వైష్ణవి హత్య కేసులో కీలక మలుపు



- కట్న వేధింపుల కేసులో భర్త కుటుంబ సభ్యుల అరెస్టు
- తల్లి, అన్నలపై హత్యకు ప్రేరేపణ ఆరోపణలు

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన గంధం వైష్ణవి (20) హత్య కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి కీలక చర్యలు చేపట్టారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు భర్త చిత్తారి హరిబాబుకు తోడ్పాటునిచ్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అతని కుటుంబ సభ్యులను పోలీసులు అరెస్టు చేయడం కేసులో కొత్త మలుపుకు దారి తీసింది.!

### కట్న వేధింపుల నేపథ్యంలో దారుణం..

మాదాపూర్ గ్రామానికి చెందిన గంధం వైష్ణవి వివాహం అనంతరం కట్నం విషయంలో భర్తతోపాటు అత్తింటి సభ్యుల నుంచి తీవ్ర వేధింపులు ఎదుర్కొన్నట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా భర్త చిత్తారి హరిబాబు తరచూ అదనపు కట్నం కోసం ఒత్తిడి చేయడంతో పాటు మానసిక, శారీరక హింసకు పాల్పడినట్లు దర్యాప్తులో బయటపడింది. ఈ వేధింపులే చివరకు ఆమె హత్యకు దారితీసినట్లు అనుమానాలు బలపడుతున్నాయి.

### కుటుంబ సభ్యుల పాత్రపై ఆరోపణలు

దర్యాప్తులో భాగంగా హంతకుడి తల్లి చిత్తారి లక్ష్మి, అన్నలు చిత్తారి ఆనంద్, చిత్తారి అశోక్ కూడా బాధితురాలిపై కట్నం కోసం ఒత్తిడి తెచ్చినట్లు, అలాగే హింసకు ప్రేరేపించినట్లు పోలీసులు నిర్ధారించారు. వీరి ప్రవర్తన వైష్ణవి పై మానసిక ఒత్తిడిని పెంచి, చివరకు హత్యకు దారి తీసిందనే అభిప్రాయం పోలీసులు వ్యక్తం చేశారు.


### పోలీసుల దర్యాప్తు - అరెస్టులు

మెట్‌పల్లి డీఎస్పీ ఏ. రాములు ఆదేశాల మేరకు ఎస్సై చిరంజీవి కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. సేకరించిన ఆధారాల ఆధారంగా చిత్తారి లక్ష్మి, చిత్తారి ఆనంద్, చిత్తారి అశోక్‌లను మార్చి 19, 2026న పోలీసులు అరెస్ట్ చేసి డీఎస్పీ ఎదుట హాజరుపరిచారు. అనంతరం వారిని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు.

### కేసులో మరిన్ని వివరాలపై దృష్టి

ఈ హత్య కేసులో మరిన్ని కోణాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కట్న వేధింపులు ఎంతకాలంగా కొనసాగుతున్నాయి, హత్యకు ముందు జరిగిన పరిణామాలు ఏవన్నది లోతుగా విచారిస్తున్నారు. ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో పోలీసులు మరింత జాగ్రత్తగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.





## శక్కరి పేర్ల సంబరం!

'పరాభవ' నామ సంవత్సర 'ఉగాది' పండుగ సందర్భంగా.. చిన్నారికి సంప్రదాయంలో భాగంగా 'అమ్మమ్మ-నానమ్మలు' శక్కరి పేరు..కుడుకల పేర్లు వేసి ఆశీర్వదించారు.! ఇది అనాదిగా వస్తున్న సంప్రదాయాల్లో ఒకటి.! పిల్లలకు తీపితో పాటు.. బలవర్ధకమైన ఆహారంగా కూడా ప్రయోజనం చేకూరుస్తుందని నాటి పెద్దల భావన..నేటి హైటెక్ కాలంలోనూ 'కొన్ని సంప్రదాయాలు..ఆచార వ్యవహారాలు..' కొనసాగుతుండడం విశేషం.!!

- నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో (రాధారపు నర్సయ్య)